అడవి రాజు

బొమ్మిడి అచ్చారావు

"కాట్రేనికోన ఏజెన్సీ ప్రాంతంలో 'ఎపిడెమిక్' అవుట్‌బ్రేకయింది. ఇంతవరకు మన వైద్యశాస్త్ర పరిధిలోకి రాని కొత్తరకం భయంకర విషజ్వరం! దాని పేరు కూడా బహుశా మనమే నిర్ణయించాలేమో! వెంటనే ఓ మెడికల్ టీమ్ కాట్రేనికోన వెళ్లాలి! అందుకే అర్జంటు సర్క్యులర్ మీద ఈ మీటింగ్ యేర్పాటు చేశాను" అన్నాడు. డి.ఎమ్. అండ్ హెచ్.ఓ. (జిల్లా వైద్య ఆరోగ్యాధికారి).

సమావేశమయిన అరవైమంది ప్రాథమికారోగ్య కేంద్రాల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్లు. ఆయన చెప్పేది శ్రద్ధగా వింటున్నారు.

"ఇప్పటివరకు ఎన్ని కేసులు రిపోర్టయ్యాయి సర్?" అనడిగాడో మెడికల్ ఆఫీసరు. అతని పేరు తీర్థానాథ్ అందరూ డాక్టర్ నాథ్ అని పిలుస్తారు. మంచి అనుభవమున్న డాక్టరు. కేసును డయాగ్నోస్ చేయటంలో సిద్ధ

హా కుస్తు.

"అరవై నాలుగు కేసులు రిపోర్టయ్యాయి. అందులో నలభై యెనిమిది మంది జ్వరం అటాక్ అయిన నలభై యెనిమిది గంటల్లో ఒళ్ళంతా పసుపుపచ్చ రంగుకు తిరిగి చనిపోయారు. తక్కిన పదహారు కేసుల్లో తొమ్మిదిమంది వివిధ అవయవాలు చచ్చుపడి జీవచ్ఛవాలయిపోయారు.

ఆరు కేసులు మెంటల్ డిప్రెషన్‌కి లోనైతే ఒకడు 'సిరోసిస్ ఆఫ్ లివర్'తో ఇవాళో రేపో అన్నట్టున్నాడు. తక్కిన వివరాలు కాప్రేనికోన పి.హెచ్.సి. మెడికల్ ఆఫీసర్స్ చెపుతారు" అన్నాడు డి.ఎమ్.హెచ్ ఓ.

కాప్రేనికోన మెడికల్ ఆఫీసర్స్ సంజీవ్, జయదేవ్ లేచి కేసు స్వభావస్వరూపాల గురించి వివరంగా చెప్పారు:

కాప్రేనికోన యిప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న ఏజెన్సీ ప్రాంతం. దానికి సమీపంలో వున్న మారేడుమిల్లి, చట్రవాడ, కె.డి. పేట వంటి ఏజెన్సీలకన్న అటవీ సంపదకు పేరెన్నికగన్నది.

ఇటీవల అకస్మాత్తుగా కాప్రేనికోన గూడేల్లో పేరు తెలియని ఓ రకమైన విషజ్వరం మహమ్మారిలా వ్యాపించింది.

మొదట ఒళ్ళునొప్పులు, తలనొప్పితో మొదలవుతుంది. ఇరవై నాలుగ్గంటల్లో జ్వర తీవ్రత గణనీయంగా పెరిగిపోతుంది. ఆ జ్వరం మలేరియా కన్నా చాలా తీవ్రస్థాయిలో వణుకు, చలితో కూడి వస్తుంది. నలభైయెనిమిది గంటల్లో ఒళ్ళంతా పసుపుముద్దలాగా మారిపోతుంది. జుట్టుతో పాటు పసుపు రంగుకి తిరిగి పోతుంది.

రోగి విపరీతమైన దాహంతో, గుండె దడ, ఆయాసంతో బాధపడతారు. ఆఖరుగా మెదడులోని నరాలు చిట్లి హేమరేజ్ తో ప్రాణాలు వదులుతారు.

వైద్యచరిత్ర కందని ఈ వింతరోగం భయంకరమైన అంటువ్యాధి కావటంవల్ల చాలా తక్కువ వ్యవధిలో గూడేలకి గూడేలని నాశనం చేసేస్తోంది. నూటికి తొంభై కేసుల్లో మరణం సంభవిస్తే ఆ తక్కిన పది శాతం వికలాంగులగానో, పిచ్చివాళ్ళగానో మారిపోతున్నారు.

డాక్టర్ సంజీవ్, జయదేవ్ లు యెంత శ్రమపడ్డా రోగంబారినపడ్డ వాళ్ళను మృత్యుముఖంనుంచి తప్పించలేక పోతున్నారు. వెంటనే హుటాహుటిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి 'ఎపిడెమిక్' (ఒకే సారి యెక్కువమందికి వ్యాపించే వ్యాధి) గురించి తెలియచేశారు.

దాని ఫలితంగానే ఇరవై నాలుగు గంటల్లో వైద్యాధికారుల అత్యవసర సమావేశం యేర్పాటు చేయబడింది.

"మీ లాబ్ టెక్నీషియన్లతో వ్యాధి సోకిన వాళ్ళకు రక్తపరీక్ష, మూత్రపరీక్ష వగయిరా టెస్ట్స్ చేయించారా?" ఓ మెడికల్ ఆఫీసర్ — సంజీవి, జయదేవ్ లను ప్రశ్నించాడు.

"చేయించాం. కాని యెలాంటి బాక్టీరియా కూడా ట్రేస్ అవుట్ కాలేదు. వైరస్ డిసీస్ అని నిర్ణయించాం."

"నా ఉద్దేశంలో యిది జాండిస్ (పచ్చకామెర్లు) సంబంధితమైనది కావచ్చు ననుకొంటున్నాను. వైరల్

పాట్స్ బైల్ పిగ్మెంట్స్, యూరిన్‌లో కనిపించలేదా?"
డాక్టర్ నాథ్ ప్రశ్నించాడు.

సంజీవ్ సమాధానం చెప్పాడు. "జాండిస్‌ని డయాగ్నోసిస్ చేయటం కష్టంగానూ. యూరిన్‌లో అవేమీ దొరకలేదు. 'సిరోసిస్ ఆఫ్ లివర్' కంప్లెయింట్ అరవై నాలుగు మందిలోను ఒక్కడిలోనే కనిపించింది. తక్కిన వాళ్ళలో లివర్ ఎన్లార్జ్ కాలేదు. నార్మల్ సైజులోనే వుంది."

ఆ తర్వాత రెండు కేన్స్‌లో ముప్ఫయిమంది డాక్టర్లు, పదిమంది రిజర్వ్ ఎపిడెమిక్ యూనిట్ స్టాఫ్ మెంబర్స్‌ని, అవసరమయిన మందుల్ని తీసుకుని కాశ్రైనికోన బయలు దేరారు.

2

కాశ్రైనికోన చేరేసరికి మరో ముప్ఫయిమందికి విష జ్వరం సోకి, అందులో ఇరవై నాలుగుమంది చివరి దశల్లో ఉన్నారు.

డాక్టర్ల కృషితో ఆరుగుర్ని మాత్రం రక్షించగలిగారు. కాని ఆయిదుగురికి అంగవైకల్యం తప్పలేదు. ఒక్కడు మాత్రం స్వల్పవైకల్యంతో చావు తప్పించుకో గలిగాడు.

ముప్ఫయిమంది డాక్టర్లలోనూ డాక్టర్ నాథ్‌లాంటి మెరికల్లాంటి డాక్టర్లు ఎనిమిదిమంది వున్నారు.

అందులో డాక్టర్ విఠల్, డాక్టర్ వర్మ, డాక్టర్ సురేఖ డాక్టర్ లతీఫ్ ప్రముఖులు.

రెండు కేసులు పరీక్షించేసరికి, అది పచ్చకామెర్లు గాని, మరేలాంటి కామెర్ల రోగంగాని కాదని నిర్ధారణ చేసుకున్నారు వాళ్ళు.

"ఈ ఫీవర్ రాకుండా నిరోధించటానికి మనం చెయ్యగలిగిందేమైనా వుందా అన్నది సురేఖ.

"అసలు రోగనివారణ కాకుండా ట్రీట్‌మెంటు కూడా సాధ్యంకాదు. ఇక ప్రివెంటివ్ మెజర్స్ గాని, ప్రికాషనరీ మెజర్స్‌గాని ఏం తీసుకుంటాం? ఎలా తీసుకుంటాం?" అన్నాడు నాథ్.

సరిగ్గా అప్పుడే డాక్టర్ల బృందం కూచునివున్న ప్రాథమికారోగ్య కేంద్రం ఆవరణలో నిలిపి వున్న, మందులున్న వేన్ ఒక్కసారిగా భగ్గున మండిపోవటం మొదలెట్టింది.

అందరూ నిర్ఘాంతపోయి చూశారు.

అక్కడ ఫైర్ యింజన్లుండటానికి అవకాశంలేదు. ఒక్కోసారి గూడేలకి గూడేలు పరశురామప్రీతి అవుతుంటే. ఆర్పటానికి నీళ్ళచుక్క కూడా లేక గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోవటం ఆ గిరిజనులకు అలవాటే.

కాని యిప్పుడు జరుగుతున్నది కొన్ని లక్షల రూపాయల మందుల నష్టం! వేన్ కూడా యెందుకూ పనికిరాదు.

సంజీవ్, జయదేవ్‌ల ఆదేశంమీద పి. హెచ్. సి. ఆవరణలో వున్న నూతి నుంచి నీళ్ళు తోడి మంటల నడుపులోకి తేవటానికి ప్రయత్నించారు గాని సాధ్యపడలేదు.

మంటల నడుపులోకి తెచ్చేసరికి మందులన్నీ మాడి మసిబొగ్గులై పోయాయి. వేన్ తిరిగి బాగుచేయించుకోవటానికి వీల్లేనంత దారుణంగా దెబ్బతిని పోయింది.

మందులన్నీ పి. హెచ్. సి. స్టోర్సులో భద్రపరచాలనుకుంటుండగా జరిగింది అనుకోని ఈ ఘోర ప్రమాదం

నిట్టనిలువునా పీకవరకు మునిగిపోయిన ఈ అడవి ప్రాంతంలోని నూటయిభై గూడేల్లోని పదహారు వేల గిరిజనుల ప్రాణాలకి భద్రత లేకుండా పోయింది. ఈ మందులుంటే, ఆ వ్యాధి యేదయినాగాని, దాని తీవ్రతను మరింత పెరక్కుండా కొంతవరకైనా నిరోధించవచ్చును.

అసలు అగ్నిప్రమాదమెలా సంభవించింది? డాక్టర్లందరు అక్కడే వున్నారు. పి. హెచ్. సి. స్టాఫ్‌తో పాటు, మామూలుగా ఒ.పి (O.P.)కి హాజరయ్యే సాధారణ రోగులున్నారు. ఇందరి సముక్షంలో జరిగింది ఘోరమైన అగ్నిప్రమాదం! ఎలా జరిగింది? ఎలా? ఎలా?

డాక్టర్లందర్నీ సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తి, తా మెదుర్కోబోయే విషజ్వర క్రిమికంటే దారుణమైన మనుషులెవరో కావాలని తలపెట్టిన దుశ్చర్యగా తోచింది.

జయదేవ్ జరిగిన విషయం వెంటనే డి.ఎమ్.ఎచ్.వో.కి టెలిగ్రా మిచ్చాడు. పోలీస్ స్టేషన్‌కి రిపోర్టు పంపించాడు.

తాము తలపెట్టిన బృహత్కార్యానికిది పెద్ద అపశకునంలా, ఆటకంలా తోచించి డాక్టర్ల బృందానికి.

ప్రమాదకారణాలు ట్రేస్ కాలేదు. అయితే ఇంతలోనే మరో ప్రమాదం విరుచుకుపడింది. రామన్నగూడెంలో విషజ్వరం తగిలి ఒకేసారి నలభైమంది అస్వస్థులైనట్టు రిపోర్టు వచ్చింది.

డాక్టర్ల బృందం వెంటనే రెండో వేన్‌లో అక్కడికి అయిదు కిలోమీటర్ల దూరంలో వున్న రామన్నగూడెం బయల్దేరింది.

3

మూడు కిలోమీటర్లు వేన్ సాఫీగా నడిచింది. అక్కడినుంచి అంతా ఎగుడు దిగుడు దారి. వేన్ లోపలికి వెళ్ళటానికి వీల్లేనంత సన్నని దారి, కచ్చాదారి, తప్పని సరిగా నడిచి వెళ్ళాల్సిందే!

తప్పనిసరిగా నడక మొదలెట్టారంతా. పి. హెచ్. సి. సిబ్బంది ముందుదారి చూపుతుండగా అందరు ముళ్ళ కంచెల్ని, మేకల్లా మొన తేలివున్న రాళ్ళని దాటుకుంటూ అతి ప్రయాసతో నడుస్తున్నారు.

ముందు నడుస్తున్న డాక్టర్ లతీఫ్ చిన్నగా కేక పెట్టాడు. చిన్న కేకే అయినా అది చావుకేకలా తోచింది అందరికీ!

అదిరిపడి అటు చూశారు.

జర్రున జారిపోతున్నాడు లతీఫ్! అక్కడ అడుగు కూడా కనపడనంత లోతుగా వున్న లోయ వుంది.

లతీఫ్ కాలు ఓ చిన్న రాయిమీదపడి స్లిప్ అయింది. తనని తాను నిలదొక్కుకొనేలోపల జారుడు మొదలై, మహావేగంగా లోయవైపు దొర్లిపోయాడు.

పి. హెచ్. సి. అటెండరు అతన్ని ఆపటానికి ప్రయత్నం చేయటంలో తనూ అతనితోబాటు దొర్లిపోయాడు.

రెండు నిముషాల తర్వాత అక్కడున్న వాళ్ళందరి గుండెలు అవిసిపోయేలా రెండు చావు కేకలు వినిపించాయి.

మొదటిది లతీఫ్‌ది, రెండోది అటెండర్‌ది.

కొన్ని వందలమీటర్ల దిగువవున్న లోయలో పడి పోయారిద్దరు.

వెంటవున్న డాక్టర్ల బృందం, పి. హెచ్. సి. సిబ్బంది నిర్ఘాంతపోయి, జరిగిపోయిన ఘోరానికి సాక్షులుగా

దిక్కుతోచక అలాగే నిల్చుని చూస్తూండిపోయారు!

తమతో అంతదాకా సజీవంగా మసలిన డాక్టరు, అటెండరు కళ్ళముందే బలైపోతే ఆ నిజాన్ని జీర్ణించుకోవటానికి చాలా టైంపట్టింది వాళ్ళకు.

గుబారు చెట్లమీద ఇద్దరు వ్యక్తులు ఎవరికీ కనిపించకుండా దాక్కుని వున్నారనిగాని, డాక్టర్ లతీఫ్‌ని చాలా లాఘవంగా లోయలోకి పడేలా వాళ్ళే నెట్టారని గాని యెవరికీ తెలియదు.

అందరి హృదయాలు భారంగా వున్నాయి.

కర్తవ్యం వెన్నుతట్టి ముందుకు నడిపించింది వాళ్ళను. యాంత్రికంగా రామన్న గూడెం నడుస్తూ మరో గంటకు చేరారు.

వాళ్ళు వెళ్ళేసరికి పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. నలభై మందికి వ్యాధి సోకినట్టు ప్రాథమిక రిపోర్టు వచ్చింది. కాని, వాళ్ళు అక్కడికి చేరుకొనే సరికి డబ్భయి మంది విషజ్వరంతో మంచాన పడ్డారు.

డాక్టర్లు చకచక మెషిన్లలా పనిచేయటం మొదలెట్టారు. తమతోటి డాక్టరు, అనుభవజ్ఞుడు, సహృదయుడు అయిన లతీఫ్ మరణం వాళ్ళని మానసికంగా బాగా అలజడికి గురిచేసింది. అందరి మనసుల్లోను తేలుకొండిలాంటి ప్రశ్న తలెత్తింది.

అందరు జాగ్రత్తగానే నడిచివస్తుండగా లతీఫ్ లోయవైపు యెలా జారిపోయాడు? అసలేం జరిగింది? లతీఫ్ మరణానికి, మందుల వేన్ తగలబడిపోవటానికి యేదయినా సంబంధముందా?

డాక్టర్ నాథ్ యిదే విషయమై తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

డెంగ్యూ కేసులకి ముప్పయి కేసులు అప్పటికే డాక్టర్ల చెయ్యి దాటిపోయాయి తక్కిన నలభై కేసుల్ని మృత్యుముఖం నుంచి తప్పించటానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు డాక్టర్ల బృందం.

"చాలా చిత్రమయిన క్లినికల్ మానిఫెస్టేషన్స్. అసలు 'రూట్ ఆఫ్ ఇన్ ఫెక్షన్' నిర్ధారించటానికి వీల్లేని పరిస్థితి. ఏ గ్రౌండ్స్ మీద ట్రీట్ చెయ్యాలో తెలియని అగమ్య పరిస్థితి. జ్వర తీవ్రతను తగ్గించటం తప్ప, మనం చెయ్యగలిగిందేమీ కనిపించటంలేదు. గాల్లో బాణం వేసినట్టే వుంది మన చికిత్స" నాథ్ చెప్పాడు రోగులందర్నీ పరీక్ష చేశాక.

తక్కిన డాక్టర్లు అతను చెప్పినదానికి ఔనన్నట్టు తల పంకించారు.

"కనీసం జ్వరతీవ్రతను తగ్గిస్తూ విషజ్వరానికి, వైరస్ ఫీవర్స్ కిచ్చే ట్రీట్ మెంట్ నే ఇవ్వటం మంచిదని నా అభిప్రాయం" అంది సురేఖ.

"యూ ఆర్ రైట్! లెటజ్ ప్రొసీడ్ ఆన్ ది సేమ్ ప్రొసీజర్!" అన్నాడు విఠల్.

"మనం ట్రీట్ మెంట్ టేకప్ చేసిన కేసులు పసుపు పచ్చ రంగుకు తిరగలేదు. గమనించారా?" అన్నాడు వర్మ.

సరిగ్గా అప్పుడే డాక్టర్ల బృందానికి కబురొచ్చింది.

భద్దెర గూడెం నుంచి విషజ్వరం సోకినట్టు. దాదాపు ఇరవైమంది అస్వస్థులైనట్టు మెసేజ్ వచ్చింది.

డాక్టర్స్‌ని కొంతమందిని భద్దెర గూడెం వెళ్ళవల

సిందిగా కోరుతూ జయదేవ్ మనిషిచేత కబురంపించాడు.

వర్మ, విఠల్, సురేఖ, మరో పదిమంది డాక్టర్లు పి.హెచ్.సి. స్టాఫ్ సాయంతో వడ్డెరగూడెం బయలుదేరారు.

నాథ్, సంజీవ్ పర్యవేక్షణలో తక్కిన డాక్టర్లు రామన్నగూడెంలోనే వుండిపోయారు.

4

వడ్డెరగూడెం మరీ దట్టమైన డొంకదారి గుండా ప్రయాణం చెయ్యాల్సి వచ్చింది.

వర్మ సురేఖను వారించాడు.

"మీరు యిలాంటి ఇంటీరియర్ విలేజికి నడిచి ప్రయాణం చేయలేరు. మీరు రామన్న గూడెంలోనే వుండిపోతే మంచిది!" అన్నాడు.

"నో, నో! మనం వచ్చింది ఆపదలో వున్న రోగుల్ని రక్షించటానికి! మన సుఖంకోసం చూసుకుంటే మన విధ్యుక్తధర్మం నెరవేర్చలేం. ఫరవాలేదు, పదండి" అంది సురేఖ.

వడ్డెరగూడెం బాగా కొండవాలు ప్రదేశంలో వుంది. ప్రయాణం చాలా కష్టంగా వుంది. అన్నీ గుబురు చెట్లు, పొదలు, లోయలతో కాలు పెట్టడానిక్కూడా వీల్లేనంత దుర్గమంగా వుంది.

మొదట్లో ఉత్సాహంగా సిద్ధపడినా, తర్వాత తను ఆ అడవిదారిన నడవటం చాలా కష్టసాధ్యమని గ్రహించింది సురేఖ. కాని పళ్ళబిగువున సహించింది.

వడ్డెరగూడెం యింకో కిలోమీటరు దూరంలో ఉందనగా డాక్టర్ వర్మ కాల్లో యేదో గుచ్చుకున్నట్టనిపించి

చటుక్కున నిల్చుండిపోయారు.

దబ్బనంలా పొడవుగా వున్న ముల్లు బూటు అడుగు నుంచి అతని అరికాలుకి బలంగా నాటుకుంది.

బాధతో విలవిల్లాడాడు వర్మ. ముల్లు తీసుకోవటాని కన్నట్టు కొద్దిగా వంగాడు.

అంతలో తక్కిన డాక్టర్లు నాలుగడుగులు ముందుకి వేశారు.

సరిగ్గా అదే సమయంలో తన నడుంమీద ఏదో వస్తువు పడినట్టనిపించి ఉలిక్కిపడ్డాడు వర్మ.

అదేమిటో గ్రహించేలోపల అతని నడుముమీద కరుక్కున రెండు పళ్ళు దిగిపోయాయి. వెన్నుపూసగుండా విషం సరాసరి మెదడుకీ, నాడీమండలానికి రక్తంతో బాటు చివ్వున ప్రసారితమయింది.

అంతే! ఉన్న చోటనే కుప్పలా కూలిపోయాడు వర్మ. అతని నోటివెంట నురుగులు. క్షణాల్లో నల్లగా బొగ్గులా మాడిపోయిందతని శరీరం. అతన్ని కాటేసిన నల్లత్రాచు తనపని పూర్తయినట్లు జర జరా పొదల్లోకి పాక్కుంటూ పోయింది.

వర్మ రాకపోవటం చూసి వెనుతిరిగిన డాక్టర్లకి నేల వాలిన శర్మ కళేబరం కనిపించింది. అందరు ఒక్క పరుగున వెనక్కి వచ్చారు.

వర్మ శవాన్ని చూస్తూనే విరల్ ముందుగా అతని నాడి చూసి, పెదవి విరిచాడు. సురేఖ వర్మ ముఖం చూస్తూనే అతను విషనాగు కాటువల్ల మరణించినట్టు గ్రహించింది.

వరుసగా అన్నీ భయోత్పాతం కలిగించే సంఘటనలే జరగటంతో యిదంతా కాకతాళీయంగా జరుగుతున్నట్టు

సరిపెట్టుకోలేకపోయారు వాళ్ళు.

ఇప్పుడు శర్మ మరణంతో డాక్టర్లకి వెన్నున చలి పుట్టింది. ఒక్క రోజులో మూడు భయంకర సంఘటనలు! మందులతో నిండివున్న వ్యాన్ సమూలంగా తగలబడి పోవటం, తమ వృత్తిలో నిష్ణాతులైన యిద్దరు ప్రముఖులయిన డాక్టర్లు కొద్ది గంటల వ్యవధిలో ప్రాణాలు కోల్పోవటం — వాళ్ళని భయభ్రాంతుల్ని చేశాయి.

అస్వస్థమనస్కులంగానే వర్ధోగూడెం చేరారు డాక్టర్లు- శర్మ శరీరాన్ని పి. హెచ్. సి.కి తరలించి. డాక్టర్ లతీఫ్ శరీరమయితే దొరకనే లేదు!

డాక్టర్లు చేరేసరికి కేసుల సంఖ్య విపరీతంగా ఏభైకి పెరిగింది. ఓ పక్క చికిత్స చేస్తుండగానే మరో పది హేనుమందికి వ్యాధి సోకింది.

డాక్టర్ విఠల్ పరిస్థితి చాలా తీవ్రరూపం ధరించినట్టు గ్రహించాడు. ఇది కేవలం తమ ముప్ఫయిమంది డాక్టర్లకి లొంగేటంత సామాన్య విషజ్వరం కాదని, తమ జిల్లానుంచే కాక, బయటి జిల్లాల నుంచి కూడా డాక్టర్లని రప్పించి, యుద్ధ ప్రాతిపదిక మీద చికిత్స జరపాల్సిందేనని నిర్ణయించుకున్నాడు.

జయదేవ్‌కి కబురు చెయ్యాలని కూడా అనుకున్నాడు. అయితే బెల్గ్రాం చూసుకుని డి. ఎమ్. హెచ్. వో. ఎలాగూ వస్తాడని అతనికి తెలుసు. అప్పుడు పరిస్థితి తీవ్రతను గురించి అతనికి తెలియపరచవచ్చు.

కాసేపట్లో విధి నిర్వహణపట్ల అత్యంత శ్రద్ధ కనపరిచే సురేఖ ఆధ్వర్యంలో డాక్టర్లందరు చిత్తశుద్ధితో తమ విధులను నిర్వహించటంలో నిమగ్నులయ్యారు.

డాక్టర్ జయదేవ్ కుర్చీలో నిటారుగా కూర్చుండి పోయి, తన కొచ్చిన లేఖను అప్పటికి అయిదోసారి ఆమూలాగ్రం చదువుతున్నాడు.

అతనికి ముచ్చెమటలు పోశాయి. ఒంట్లో సన్నగా ప్రకంపనలు మొదలయ్యాయి. అప్పటికి రెండు గ్లాసుల మంచినీళ్ళు తాగాడు. ఇంకా సిగరెట్లు చెయిన్ స్మోకింగ్ చేశాడు.

ఏడోసారి ఆ ఉత్తరం చదువుతున్నాడు.

"డియర్ డాక్టర్ జయదేవ్,

ఈ పిహెచ్ సిలో నీ శవం కూడా పార్లాడకుండా వుండాలంటే, నీ భార్యాబిడ్డలు నీ కళ్ళ ముందే దారుణంగా చావకుండా వుండాలంటే, వచ్చిన డాక్టర్ని యేదో సాకుతో వెంటనే పంపెయ్యి. లేకుంటే ఇరవై నాలుగ్గంటల్లో నీ కుటుంబాన్ని నీతో బాటు సమూలంగా నాశనం చేసేస్తాను.

నేనెవరో నీకు తెలియకపోయినా ఏం ప్రమాదంలేదు. తెలుసుకోవాలనుకున్నా నీ తరం కాదు. నేను నీ అడవిలోని చెట్టులో చెట్టుని, ఆకులో ఆకుని, పుట్టలో పుట్టని, గుట్టలో గుట్టని.

బి కేర్ ఫుల్!

—నీ శ్రేయోభిలాషి."

జయదేవ్‌కి అది ఉత్త బెదిరింపు మాత్రమే కాదని ఆ 'శ్రేయోభిలాషి' వాక్శూరుడే కాదు, కార్యశూరుడే నని జరిగిపోయిన దుర్ఘటనలు తిరుగులేని సాక్ష్యాలుగా

కనిపిస్తున్నాయి.

అంతిక్రితమే వర్మ శవాన్ని పి హెచ్.సి.కి తీసుకొచ్చారు. దాన్ని హెడ్ క్వార్టర్సుకి పంపించటానికి సన్నాహాలు చేస్తుండగా ఇంతలో యెవరో ఇచ్చారంటూ ఓ పేమంటు వర్రాడు ఉత్తరం తెచ్చియిచ్చాడు.

అప్పట్నుంచి మొదలయ్యింది జయదేవ్ లో ఆరాటం! సంజీవ్, మరో డాక్టరు భీమశంకరం రాగన్నగూడెం వెళ్ళారు. పి హెచ్.సి. స్టాఫ్ కూడా వాళ్ళవెంట వెళ్ళారు. ఇద్దరు ఏ ఎన్నెమ్ లు, ఓ ఇన్ స్పెక్టరు, హెల్తు అసిస్టెంటు, టెక్నీషియన్, ఓ అటెండర్ తను మాత్రమే పి. హెచ్ సి.లో వున్నారు.

ఇప్పుడు తనేం చెయ్యాలి? డాక్టర్ల వలన ఆ వ్యక్తికి వచ్చిన నష్టమేమిటి? వాళ్ళనెందుకు వెనక్కి పంపించెయ్యమంటున్నాడు?

ఓ పక్క సీరియస్, అవుట్ బ్రేక్ ఆఫ్ ఎపిడిమిక్ తో వందలాది ప్రాణాలు నష్టపోతుంటే, వాళ్ళ ప్రాణాలు రక్షించటానికి కష్టనష్టాల కోర్చి వచ్చిన డాక్టర్ని వెనక్కి పంపెయ్యాలా?

ఇదేదో చిన్న విషయమా, పంపెయ్యటానికి? ఈ జిల్లాలోనే కాక, ఇతర జిల్లాలకు కూడా ఈ వ్యాధి గురించి సమాచారం తెలిసిపోయింది. వైద్య ఆరోగ్య సర్వీసెస్ డైరెక్టర్ కి కూడా టెలిగ్రాం వెళ్ళిపోయుంటుం దీపాటికి.

ఇంకా అదనంగా వైద్యసిబ్బందిని, పరికరాల్ని, మందుల్ని పంపించవలసిన తీవ్రపరిస్థితి! ఇలాంటి సమయంలో వున్నవాళ్ళని యేదో సాకుచెప్పి పంపెయ్యమని ఆ వ్యక్తి, లేక వ్యక్తుల సముదాయం బెదిరిస్తుంటే

రొలా యీ విపత్కర పరిస్థితి నుంచి బయట పడటం....!?

తను కాదని ఎదురుతిరిగితే!? తనని చంపెయ్యొచ్చు. తన భార్యాబిడ్డల్నికూడా మట్టుబెట్టొచ్చు....తమ స్వార్థం కోసం వేలాది గిరిజనులను బలిచెయ్యటం యేమాత్రం న్యాయంకాదు.

ఆ 'శ్రేయోభిలాషి'తో తలపడటానికే నిర్ణయించు కున్నాడు జయదేవ్. అప్పుడతని కళ్ళముందు భార్యా బిడ్డలు కనిపించలేదు—కొన్ని వేలమంది గిరిజనులు కనిపిస్తూ న్నారు.

జయదేవ్ నెత్తిమీదుగా గోడపైనున్న ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిగారు ఫోటోలో నుంచి కర్తవ్యో న్ముపదేశిస్తున్నట్టుగా అనిపించిందతనికి.

మరో అరగంట తర్వాత చెంచుగూడెం నుంచి మెసేజ్ వచ్చింది.—పది కేసులు రిపోర్టయ్యాయి.

జయదేవ్ రామన్నగూడెం, వడ్డెంగూడెం క్కూడా కబురు పెట్టాడు ఆ రెండు బాచ్‌ల్లోని డాక్టర్లలో కొందర్ని చెంచుగూడెం వెళ్ళవలసిందిగా కోరాడు. తను స్వయంగా చెంచుగూడెం బయల్దేరాడు.

సరిగ్గా అప్పుడే అతనికి ఎఫ్.ఎస్.ఓ. ఓ ఉత్తరం తీసు కొచ్చి ఇచ్చింది, మూసివున్న కవరుతో.

జయదేవ్‌కి తెలుసు అది 'శ్రేయోభిలాషి' నుంచి వచ్చినట్టు. సెకండ్ వార్నింగ్ వచ్చివుంటుంది. తనిలాంటి వాటిని లెక్కచెయ్యకూడదు.

అనాసక్తంగానే తెరిచి చదివాడు.

"....నేను హెచ్చరించినా వినకుండా చెంచు గూడెం కేసుల్ని కూడా అటెండ్ కావడానికి

పెడుతున్నావు కదూ! ఫలితం అనుభవిస్తావు....”

అని వుంది అందులో.

దాన్ని ముక్కలుగా చించి, సింక్‌లో వేసి నాబ్ తిప్పాడు జయదేవ్.

సరిగ్గా మరో అరగంటలో డి.ఎమ్.హెచ్.వో.కి టెలిగ్రాం వెళ్ళింది జయదేవ్ పేర.

“పరిస్థితి అదుపులో వుంది. అదనపు సిబ్బంది అవసరం లేదు. కొత్త కేసులు రిపోర్టు కాలేదు!” అని.

జయదేవ్‌కి సకల సన్నాహాలు చేస్తున్న డి.ఎమ్.హెచ్.వో ఆగిపోతాడని, ఆ టెలిగ్రాం చూసి సంతృప్తి పడిపోతాడని ‘శ్రేయోభిలాషి’కి తెలుసు!

అదే జరిగింది! డిఎమ్‌హెచ్‌వో ఆగిపోయాడు.

డ్రగ్స్‌తో వేన్ కాలిపోయినట్టు అతను డిఎమ్‌హెచ్‌వోకిచ్చిన టెలిగ్రాం అతన్ని చేరకుండా నే మధ్యలో నే ట్రాప్ అయిపోయినట్టు జయదేవ్‌కి తెలియదు.

6

చెంచుగూడెం అక్కడికి రెండున్నర గంటల ప్రయాణం!

జయదేవ్ వాచ్ చూసుకున్నాడు.

సాయంత్రం అయిదున్నర కావస్తోంది.

ఎఫ్.ఎస్.వో.ని పిలిచి, తమ క్వార్టర్సుకి కబురు పెట్టాడు—ముప్ఫయి మందికి సరిపడేలా వంట చేయమని!

మెడికల్ ఆఫీసర్సుకి పి. హెచ్. సి ఆవరణలో నే క్వార్టర్సు ఇవ్వబడ్డాయి.

కేసులు యెక్కడున్నాం చయినా రిపోర్టు వస్తే చెంచుగూడెం కబురు పెట్టమని చెప్పాడు.

చెంచుగూడెం మరో గంటలో చేరతామనేసరికి చీకటిపడిపోయింది. వెంట టార్చిలైటు తెచ్చాడు. ముందు ఎక్సైజ్‌వో, టెక్నిషియన్, ఓ హెల్తు అసిస్టెంటు, ఫేమిలీ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టరు నడుస్తూండగా జయదేవ్ ఆలోచనల్లో మునిగి పరధ్యానంగా నడుస్తున్నాడు.

అకస్మాత్తుగా జయదేవ్ మెడకు పైనుంచి ఉరిపడి క్షణాల్లో బిగిసింది. ఒక్క నిమిషం మాత్రం చెట్లమీదికి లాగివేయబడ్డాడు. మరునిమిషం నేలమీదికి వదిలివేయబడ్డాడు. ఇప్పుడు అతని మెడకు ఉరి లేదు!

ముందుగా ఇన్‌స్పెక్టరు, హెల్తు అసిస్టెంటు తమ ఆఫీసరు రాకపోవటం గమనించి వెనుతిరిగి చూశారు.

నేలమీద నిర్జీవంగా పడున్న జయదేవ్‌ని చూసి అందరికీ గుండెలవిసిపోయాయి. దగ్గరగా వచ్చి చూసి, ప్రాణంలేదని నిర్ధారణ చేసుకున్నారు.

హెల్తు అసిస్టెంటు వడ్డెగూడెం, ఇన్‌స్పెక్టరు రామన్నగూడెం, టెక్నిషియన్ చెంచుగూడెం వెళ్ళారు ఈ విషయం తెలియచేయటానికి. ఒక్కరోజులో ముగ్గురు డాక్టర్లు ప్రమాదానికి గురయి చచ్చిపోవటం అందరి గుండెల్ని అదరగొడుతోంది. జయదేవ్ శవంవద్ద ఎక్సైజ్‌వోని కాపలా పెట్టారు.

7

రామన్నగూడెంలో నాథ్ ఆధ్వర్యంలో చికిత్స సాగుతోంది.

నాథ్ వ్యాధి యెక్కడ ఎలా ప్రారంభమయిందో మొదటిగా ఎవరికి సోకిందో ఆ విషయాలన్నీ ఆరా తీశాడు.

మొదట ఓ పన్నెండేళ్ళ కుర్రాడికి తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, వాంతులతో మొదలయ్యింది విషజ్వరం! ఆ తర్వాత ఆ ఇంటిలోని వారందరికీ వ్యాధి సోకింది. క్షణాల్లో వాళ్ళుకూడా వ్యాధిగ్రస్తులయ్యారు.

నాథ్ కనిపెట్టిన విషయమేమిటంటే ఈ వైరస్ ఫీవర్ కేవలం నీటిద్వారానే వ్యాప్తి చెందినదని! అపరిశుభ్రమైన ఈ కొండజాతి మనుషుల ఆహారపుటలవాట్లే అందుకు కారణం.

వీళ్ళు ఆరోగ్య విషయమై చాలా వెనకబడి వున్నారు. ప్రకృతిసిద్ధంగా దొరికే పండ్లు, వెదురుబియ్యంవంటి పదార్థాలనే ఆహారంగా ఉపయోగిస్తూ, కొండ బండలమధ్య నుంచి ప్రవహించే నీటినే తాగుతూ బతికేయటం అనాదిగా వాళ్ళ కలవాటు!

ఈ వైరస్ చాలా వేగంగా వ్యాప్తిచెందే లక్షణమున్న అతి భయంకర క్రిమి. వైద్య చరిత్రలో దీనికింకా పేరు నిర్ణయించబడలేదన్నది నిర్వివాదాంశం.

అందుకే ఎలాంటి చర్యలద్వారా వ్యాధిని రాకుండా నిరోధించటమో ఇతమిద్ధంగా తెలీని అగమ్య పరిస్థితి ఎదురైంది వాళ్ళకి.

అయితే వాళ్ళు తీసుకొన్న జాగ్రత్తలవల్ల, ఇచ్చిన చికిత్సవల్ల కొత్తగా ఆ గూడెంలో మళ్ళీ కేసులు రాకుండా చేయగలిగారు.

అక్కడ వడ్డెర గూడెంలో కూడా సురేఖ కొత్తగా ఎవరికీ వ్యాధి సోకకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నది.

ఓ పక్క తాము వ్యాధి సోకిన వాళ్ళకు నిర్విరామంగా సేవచేస్తూంటే కొత్తగా మరో గూడెంలో వ్యాధి

పోకటం, మళ్ళీ అక్కడకు పరుగెత్తటం డాక్టర్ల పాహ పానికి అగ్నిపరీక్షలా వుంది.

ఇద్దరు డాక్టర్లు రామన్న గూడెంలోను, ముగ్గురు వద్దెగూడెంలోను కేసుల పర్యవేక్షణకు ఉండి. తక్కిన డాక్టర్లందరు జయదేవ్ పంపిన కబురు అందుకొని చెంచు గూడెం వెళ్తూండగా, జయదేవ్ దుర్మరణ వార్త తెలిసింది.

సరిగ్గా అందరి మనసుల్లోను అప్పుడే ఓ తీవ్రమైన అలజడి చెలరేగింది. ఉదయంనించి అప్పటివరకు జరిగిన దుస్సంఘటనలు కాకతాళీయంగా జరిగినవి కాదనే నిర్ణయానికొచ్చారు.

అయితే, ఎవరు చేస్తున్నారిదంతా? ఈ అమాయక ప్రజల్ని రక్షించాలని వచ్చిన ఇద్దరు డాక్టర్లు. స్థానికంగా వున్న మరో డాక్టరు—కొన్ని గంటల వ్యవధిలో దుర్మరణం పాలుకావటం సామాన్యమైన విషయంకాదు!

పెద్ద సంచలన వార్త!

ఇప్పుడు తామేం చేయాలి? కనీసం జిల్లా అధికారి అయిన డిఎమ్‌హెచ్‌వో అయినా వచ్చి చూస్తే బావుండును! వేనే తగలబడిపోయిన వార్త టెలిగ్రామిచ్చినా ఇంకా ఎవరూ బయల్దేరి రాకపోవటం చాలా విచిత్రంగా కనిపిస్తోంది.

అన్యమనస్కంగానే అందరు చెంచుగూడెం బయల్దేరారు.

అప్పుడు సమయం రాత్రి ఎనిమిదిగంటలు కావస్తోంది.

ఎవరి మట్టుకు వాళ్ళు బాగా అలిసిపోయారు. పి. హెచ్.సి.నుంచి తెచ్చుకున్న కాఫీలు తప్ప స్పాట్‌లో చుక్క నీరుకూడా ఎవరూ తాగలేదు. తమ వెంట వున్న

పి హెచ్ సి స్టాఫ్‌ని మాత్రం నీటిని కాచుకొని వడబోసి తాగమని సలహా చెప్పారు.

చెంచుగూడెంలో పని పూర్తి చేసుకొని మరో ముగ్గురు డాక్టర్లు కాత్రేనికోన మూడో డాక్టరు భీమశంకరం అక్కడ వుండటానికి నియమించి, సురేఖ, నాథ్, విఠల్ మొదలైన డాక్టర్లంతా పి హెచ్ సికి సంజీవ్‌తో సహా బయల్దేరారు. వాళ్ళకి కావలసిన సదుపాయాలు చూడటానికి.

అప్పుడు రాత్రి పదిగంటలయింది.

గిరిజన నాయకులు, గూడెం పెద్దలు డాక్టర్లని సాగనంపటానికి సాయం బయల్దేరారు.

అక్కడికి కాత్రేనికోన రెండున్నర గంటల ప్రయాణం! అడ్డదారిన గంటన్నరలో వెళ్ళవచ్చునని గూడెంవాళ్ళు సలహా చెప్పటమే కాక ఆ దారిన తీసుకు వెళ్ళటానికి సిద్ధమయ్యారు.

అలిసిపోయిన డాక్టర్లు ఓ గంట ప్రయాణం తగ్గటమే చాలుననుకొని సరేనన్నారు.

అయితే, దారి చాలా దుర్గమంగా వుంది!

అసలే రాత్రి సమయం. పైగా చీకటి రాత్రులు! ఎగుడుదిగుడు దారి. ఓ అరగంట ప్రయాణం జరిగింది.

గిరిజన నాయకులు చేతి కాగడాలు ధరించి దారి చూపిస్తూన్నారు. ముందు కొంతిమంది మధ్యలో డాక్టర్లు, చివరగా మళ్ళీ గూడెం పెద్దలు అంగరక్షకుల్లాగా వెంట వెంటే నడుస్తూన్నారు.

సరిగ్గా అప్పుడే ఎక్కడినుంచో బాణాలు రివ్వురివ్వున దూసుకొచ్చి గిరిజన నాయకుల్ని, గూడెం పెద్దల్ని తీవ్రంగా గాయపరిచాయి.

వాళ్ళ చేతుల్లోని కాగడాలు ఎగిరి అవతల పడ్డాయి. ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి యేర్పడింది. చుట్టూ చీకటి ఆవరించుకొని ఎంతటి ధైర్యవంతుడినైనా భీరువుగా మార్చెయ్యగల వాతావరణం భయంకరంగా పరచుకొని వుందక్కడ!

సరిగ్గా అదే సమయంలో ఎక్కడినుంచో పులి గాండ్రింపు వినిపించింది.

గాయపడ్డ గిరిజనులు తేరుకోవటానికి చాలా సేపు పట్టింది. కిందపడ్డ కాగడాలు అందుకొని, బాణాలు ఎవరు ప్రయోగించారో తెలియని అయోమయస్థితిలో చేతుల్లో వున్న బల్లేలని స్థిరంగా పట్టుకుని వెనుతిరిగి కొండభాషలో తీవ్రపదజాలంతో గట్టిగా తిట్టారు.

కాని ఎక్కడ్నుంచీ సమాధానం లేదు!

డాక్టర్లయితే పూర్తిగా భయపడిపోయారు. బాణాలు ఎవరు గుప్పించారు? భయాందోళనలతో గిరిజనులవంక చూశారు.

"మీ పేనాలకి మా పేనాలడ్డం పెడతాం దొరలూ! మీకేటి భయంలేదు. మాం బతికుండగా మీమీద ఈగా వోల్దు" అన్నారు గిరిజనులు దృఢంగా.

వాళ్ళు అంత సమర్థులేనని డాక్టర్లకికూడా నమ్మకం కుదిరింది. ఒంటికి గుచ్చుకున్న బాణాల నొప్పిని, లెక్క చెయ్యకుండా చేత్తోతీసి అవతల విసిరేశారు. సూది గుచ్చుకున్నట్టుగా, యేమాత్రం చలించకుండా వాళ్ళ ప్రాణాలని పణంపెట్టి తమకోసం తాపత్రయపడుతున్న ఆ గిరిజనుల్ని చూశాక, వాళ్ళ బంధువులకోసం తాము అంతదాకా పడ్డ శ్రమ వ్యర్థం కాలేదనిపించింది వాళ్ళకు.

అయితే ఊహించనివిధంగా గిరిజనులందరు ఒకరి

తర్వాత ఒకరుగా చాపచుట్టల్లా నేలమీద పడిపోయి గిలగిల కొట్టుకోసాగారు.

వాళ్ళు చెప్పకుండానే, ఆ అవసరం లేకుండానే ఏం జరిగిందో డాక్టర్లకి తెలిసిపోయింది.

వాళ్ళు చేతులు జోడించి, "దొరలూ, బాణాలకి గరలం పూసినారు. కానుకోలేకపోయినం, ఎలిపోతున్నాం, జాగ్రత్తగా ఎల్లుండి" అంటూ తలలు వాల్చేశారు.

వాళ్ళ నోటిచివర్లనుంచి నురగలు. విషసర్పాలు కాటందుకుంటే కనిపించే లక్షణాలు స్పష్టంగా వాళ్ళలో కనిపించాయి.

బాణం చివర్లకు విషసర్పాలనుంచి సంగ్రహించిన విషం పూశారు శత్రువులు.

ఇంతకీ వాళ్ళెవరు? ఎవరిమీద కక్ష?

"ఆ కాగడాలు చేతపట్టుకోండి!" అన్నాడు నాథ్, స్టాఫ్ వంక చూసి.

కాగడాల వెలుగులో నేలకూలిపోయిన గిరిజనుల శవాలు చాలా వికృతంగా కనిపిస్తున్నాయి.

కొద్దిసేపు అందరు మౌనంగా వాళ్ళ ఆత్మశాంతికి ప్రార్థన చేశారు. అందరి మనసులు చాలా భారంగా వున్నాయి. ఒకదానివెంట మరొకటి అన్నీ విషాద సంఘటనలే!

దారుణ మారణహోమం!

సమీప పొదల్లో తీవ్రమైన అలజడి రేగింది.

తేళ్ళు, కండెళ్ళు, చిన్న చిన్న జంతువులు అలజడిగా అటు ఇటు పరుగులు పెట్టాయి. అంతదాకా కనిపించకుండా దాగిన మూగజీవులన్నీ కకావికలుగా చెదిరిపోయాయి.

అయిదు నిమిషాల్లో ఆ ప్రదేశమంతా చాలా నిశ్శబ్దంగా మారిపోయింది.

గాల్లో అదోరకమైన గబ్బువాసన వాళ్ళ నాసికాపుటాలకి సోకింది.

నాథ్ వెంటనే అందరికంకా హెచ్చరికగా చూసి, "పులి చాలా సమీపంలోనే ఎక్కడో పొంచి వుంది. వెంటనే నెగడు వెలిగించి దాన్ని భయపెట్టి తరిమేయాలి" అన్నాడు.

నలుగురు చకచక చితుకులు పోగుచేసి, కాగడాతో మంట చేశారు.

సరిగ్గా అప్పుడే పొదల్లోంచి వాళ్ళమీదకు దూకబోయిన పులి, అలజడిగా అక్కడినుంచి పారిపోయింది. ఎండుటాకులమీద చితుకులమీద పెద్దగా శబ్దమయింది. గబ్బువాసనకూడా మాగమైపోయింది.

"బ్రిల్లియంట్ యాక్షన్! పులి పారిపోయింది" అన్నాడు విఠల్ ప్రశంసగా నాథ్ వంక చూస్తూ.

అంతదాకా ఊపిరి బిగబట్టి చూస్తూన్న అందరికీ రిలీఫ్ అనిపించింది.

మళ్ళీ ముందుకు ప్రయాణం మొదలయ్యింది, అయితే అప్పటికి కాగడాల వెలుగు దాదాపు క్షీణించిపోయింది. చమురు ఖర్చయిపోయింది.

టార్చిలైట్లు రెండే రెండున్నాయి వాళ్ళవద్ద. వాటి వెలుగులోను, కాగడాల గుడ్డివెలుగులోను ముందుకు సాగుతున్నారు.

ఇంకా రెండుకిలోమీటర్ల దూరముంది.

సరిగ్గా అప్పుడే ఎవరూ ఊహించని సంఘటన జరిగిపోయింది,

ఒక్కసారిగా ఏభైమంది ఆటవికులు, విల్లమ్ములు, పట్టాకత్తులు, బరిసెలు ధరించి వాళ్ళని చుట్టుముట్టారు.

కాసేపటివరకు దిగ్భ్రాంతినుంచి ఎవరూ తేరుకోలేక పోయారు.

నాథ్ ధైర్యంచేసి, "ఏమిటిదంతా? ఎందుకు మీరు మమ్మల్ని చుట్టుముట్టారు?" అనడిగాడు వాళ్ళని.

వాళ్ళు ఆయుధాలు గురిచేసి పట్టుకొని, "ఎవరూ మాట్లాడకుండా మా వెనకమాలి రండి. లేకపోతే పేనాలు తీసేత్తాం" అన్నారు.

సంఖ్యలో తామకూడా దాదాపు ఏభైమంది వరకు వున్నా, నిరాయుధులు.

వాళ్ళు చూడబోతే జాలి, కనికరం, దయ ఉన్న వాళ్ళుగాని, ఆ మాటలకర్థం తెలిసినవాళ్ళుగాని కాదని నాథ్‌కి తక్కినవారికి కూడా తెలుసు. అయితే ఇంత దాకా తాము చికిత్సచేసిన గిరిజనుల్లో ఇలాంటి దుష్ట స్వభావమున్న వాళ్ళెవరూ తారసపడలేదు.

వీళ్ళు ఈ గూడేలకి సంబంధించిన వాళ్ళేనా? అలా కనిపించటంలేదు.

అయితే, వీళ్ళెవరు?

ఆ రోజంతా జరిగిన మారణహోమాలు గుర్తొచ్చాయి వాళ్ళకు. ముగ్గురు డాక్టర్లని నిర్దాక్షిణ్యంగా చంపేశారు. వ్యాన్‌తోబాటు ప్రాణరక్షణ మందులన్నీ తగలేశారు. ఇప్పుడు తమని నిర్బంధిస్తున్నారు. కాదంటే నిస్సంకోచంగా ప్రాణాలు తీసేస్తారు.

విఠల్, నాథ్ తమ బృందంవైపు సాభిప్రాయంగా చూశారు. అందరు ఆటవికుల వెంట వెళ్ళటానికి మానసికంగా తమను తాము ప్రిపేర్ చేసుకున్నారు.

"ఊఁ! పదండి వేగి" అన్నారా ఆటవికులు.

డాక్టర్ల బృందం వాళ్ళ వెంట మౌనంగా నడిచారు. ఓ అరగంట ప్రయాణం తర్వాత గుహలా వున్న నేల మాళిగలోపలికి తీసుకు వెళ్ళారు ఆటవికులు.

8

లోపల చీకటిగా, దారుణంగా వుంటుందని ఊహించిన డాక్టర్లకు, అక్కడ అధునాతన సౌకర్యాలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న కట్టడాలని చూసి నోట మాట రాలేదు.

అప్పుడు రాత్రి సరిగ్గా పన్నెండు గంటలయింది.

పొడవుగా వున్న ఓ హాల్లో వాళ్ళందర్నీ సామూహికంగా బంధించి, తలుపులు మూసేశారు ఆటవికులు.

నాథ్, విఠల్ వాళ్ళని ఆపి వివరాలడగాలనుకున్నారు. కాని వాళ్ళందుకవకాశమివ్వకుండా మౌనంగా వెళ్ళిపోయారు.

వాళ్ళ అంతర్యం తెలిసినట్టుగా ఎక్కడి నుంచో మాటలు వినిపించాయి.

"మిమ్మల్ని వెంటనే పంపించివెయ్యమని డాక్టర్ జయదేవ్ కి చెప్పాం. కాని అతను మూర్ఖత్వంతో తన ప్రాణాల్నే బలి చేసుకున్నాడు. మీ ప్రాణాలకి ముప్పు తెచ్చాడు."

డాక్టర్ల బృందం చెవులు రిక్కించి వింటున్నారు. బహుశా ఆ హాల్లో యెక్కడో స్పీకర్లు అమర్చబడి వుంటాయని గ్రహించారు.

నాథ్ చుట్టూ చూసి, "ఇంతకీ మీరెవరు? ఎందుకు మేమంటే మీ కింత పగ? మేము రోగులకు సేవ చెయ్యటానికొచ్చిన డాక్టర్లం. ఎవరికీ హాని చేసేవాళ్ళం కాదు! మా

మీద కత్తి దేనికి?" అన్నాడు.

జవాబుగా వికటాట్టహాసం వినిపించింది.

"నన్ను ప్రశ్నించే అధికారం యెవరికీ లేదు. నే నీ అడవికి మకుటంలేని మహారాజాని. నాకు వ్యతిరేకంగా ప్రవర్తించినవాళ్ళు గాని, నన్నెదిరించినవాళ్ళు గాని ఇప్పటివరకు బతికి బట్టకట్టలేదు."

"మమ్మల్ని యేం చేయాలనుకుంటున్నారు? మేము తిరిగి వెళ్ళిపోవటంవల్ల మీకేమి లాభం? మేము లేకుంటే యీ అమాయక ప్రజల్ని రక్షించే దెవరు?" విఠల్ అడిగాడు.

"ఎవరూ రక్షించనక్కర్లేదు. రక్షించకూడదనే నేను కోరేది."

ఆ మాట వింటూనే వాళ్ళందరూ మ్రాన్పడిపోయారు.

సురేఖ నోరు తెరిచింది: "చాలా అన్యాయంగా మాట్లాడుతున్నారే! గుర్తుతెలియని క్రిమి ఈ గిరిజనుల ప్రాణాల్ని విషజ్వరం రూపంలో హరిస్తుంటే, మా ఆరోగ్యాన్ని పణంపెట్టి ట్రీట్ చెయ్యటానికొచ్చాం. ఎన్నో ప్రాణాల్ని నిలబెట్టాం. మా అవసరం లేదని తెలిసిన మరుక్షణం తిరిగి వెళ్ళిపోతాం. అంతవరకు మా విధ్యుక్తధర్మాన్ని మమ్మల్ని నిర్వర్తించనివ్వండి."

"విధ్యుక్తధర్మం!" అతను హేళనగా నవ్వాడు. "మీకు వాళ్ళనిరక్షించటం విధ్యుక్తధర్మమయితే, నాకు వాళ్ళను, రక్షించే వాళ్ళను భక్షించటం విధ్యుక్త ధర్మం!"

అతని భావం వాళ్ళ మేధస్సు కందటంలేదు. అతను బాగా దుర్మార్గుడయినా అయివుండాలి, లేదా పిచ్చివా

డయినా అయ్యుండాలి! ఇది పిచ్చివాడి స్వర్గంలా వుంది!

"ఇంతకీ మమ్మల్నేం చేయాలనుకుంటున్నారు?" అన్నాడు నాథ్ వస్తున్న కోపాన్ని అణుకుంటూ.

"అదిప్పుడు చెప్పను. ప్రస్తుతానికి మీరంతా నా బందీలు. మిమ్మల్ని ప్రాణాలతో ఉంచాలా, పరలోకం పంపించాలా అన్న విషయం ఇరవై నాలుగ్గంటల్లో నిర్ణయించి చెప్తాను."

"దారుణం! ఈ లోపల మరికొన్ని గూడేలకి ఆ విష జ్వరం పాకిపోతుంది. అప్పుడు ఎవరూ కంట్రోల్ చెయ్య లేనంతగా చెయ్యిదాటి పోతుంది. సర్వనాశనమయి పోతుంది" ఆవేదనగా చెప్పాడు విఠల్.

"అయిపోనివ్వండి, నాక్కావలసిందీ అదే!"

"అంటే మేము లేకపోయినంత మాత్రాన రాష్ట్రం డాక్టర్లవు గొడ్డుబోయిందా? మేం రాకపోవటంతో ఎంక్వయిరీ జరుగుతుంది. మరింత మంది డాక్టర్లు రంగం లోకి దిగుతారు. మీరు వాళ్ళని కూడా బంధిస్తే మరింత మంది.... ఈసారి పోలీసు బందోబస్తుతో మిలిటరీ సహా యంతో వచ్చి చికిత్స కొనసాగిస్తారే గాని, మానటం జరగదు.... ప్లీజ్ మైండిట్!"

సురేఖ ఆవేశంగా చెప్పింది.

"అదీ చూద్దాం మేడమ్! ఇంతవరకూ నేననుకున్న వన్నీ సాధించాను. ఇదీ సాధించితీర్తాను. మీతో నాకు వాదన అనవసరం. భగవంతుడ్ని ప్రార్థించుకుంటూ కాల క్షేపం చేయండి."

ఆ తర్వాత మరి మాటలు వినిపించలేదు. అంతరవరకు ప్రశాంతంగా వెలుగుతున్న దీపాలు ఒక్కసారిగా డిమ్

అయిపోయాయి.

డాక్టర్లందరు ఒకరిముఖాలొకరు చూసుకున్నారు. చాలా చిత్రమైన పరిస్థితుల్లో యిక్కడ చిక్కుకుపోయి నందుకు చింతించసాగారు.

పి.హెచ్.సి. స్టాఫ్ కూడా డాక్టర్లతో బాటు బందీలై పోయారు.

సంజీవ్ డాక్టర్లవంక అపాలజెటిక్‌గా చూసి, "అయామ్ వెరీసారీ! ఈ రోజంతా మీకు ఆహారపానీ యాలు లేకుండా చేశాను. మా పి.హెచ్.సి. తరఫున క్షమాపణ వేడుకుంటున్నాను" అన్నాడు.

"ఇట్సాల్‌రైట్! ఇప్పుడు మనమేం చెయ్యాలో నిర్ణయించుకోవాలి. మనకిది ఓ సవాల్!" అన్నాడు నాథ్.

9

పరిస్థితి అదుపులో ఉందని వచ్చిన టెలిగ్రాం చూసు కుని డిఎమ్‌హెచ్‌వో సంతృప్తిపడ్డాడు. కాని, ముగ్గురు డాక్టర్లు దారుణంగా బలయిపోయారన్న వార్త, వ్యాన్ తగలబడిపోయిన వార్త పేపర్లో చూసి హతాశుడై పోయాడు.

విలేఖర్లకు అడ్డేముంది? ఎంత దాయాలని ప్రయత్నిం చినా నిజాల్ని వాళ్ళనుంచి దాచలేరు. కాలిపోయిన వ్యాన్‌ని ఫోటాలతో బాటు ప్రచురించారు.

డాక్టర్ల మారణహోమం గురించి, దారుణ విషజ్వరం గురించి ప్రముఖంగా ప్రచురించారు.

అయితే అప్పటికింకా డాక్టర్ల అంతర్ధానం గురించిన వివరాలు తెలియనందున ఆ విషయం మాత్రం పేపర్లో రాలేదు.

డిఎమ్‌హెచ్‌వోకి చాలా ఆగ్రహం కలిగింది. మందులతో ప్రభుత్వ వాహనం తగలబడిపోతే ముప్ఫయిమంది సెర్టిఫికేట్ చెయ్యాల్సిన డాక్టర్లు గాని, పి.హెచ్.సి.లోని ముగ్గురు డాక్టర్లు గాని ఎందుకు తనకు తెలియచేయలేదు?

డాక్టర్లు ముగ్గురు — జయదేవ్‌తో బాటు — యెలా చనిపోయారు? అసలేం జరిగింది?

డిఎమ్‌హెచ్‌వో సిబ్బందితో కాట్రేనికోన హుటాహుటిన బయల్దేరాడు.

జరిగిన విచిత్ర సంఘటనలు విని మ్రాన్పడిపోయాడు. డాక్టర్లు గతరాత్రి హెడ్‌క్వార్టర్స్‌కి తిరిగిరాని విషయం తెలిసి, నిర్ఘాంతపోయాడు.

చెంచుగూడెంనించి డాక్టర్లు బయలుదేరడం, దార్లో ఆటవికులు దారుణంగా బలవటించారని చెప్పగలిగాడో గిరిజన యువకుడు. కాని ఆ తర్వాత డాక్టర్లేమయ్యారో యెవరూ చూసినవాళ్ళు లేరు.

ఆ గిరిజన యువకుడు తమ గూడెం నాయకులు దెబ్బ తిని నేలవాలిపోతున్న సమయానికి చెంచుగూడెం వెళ్తున్నాడు జరిగిన దారుణం గురించి తన గూడెంవాళ్ళకి చెప్పి సహాయం తీసుకువద్దామని పరుగెత్తాడు చెంచుగూడెం వైపు.

అతను వాళ్ళ గిరిజన యువకుల్ని, మరికొందరు పెద్దల్ని వెంటబెట్టుకొని తమ గూడెం నాయకులు బాణాల దెబ్బలు తిని నేలకూలిన ప్రదేశానికొచ్చేసరికి డాక్టర్లు లేరు— శవాలు తప్ప.

జరిగిందేమిటో అర్థంకాని పరిస్థితుల్లో తమ నాయకుల

శవాలు తీసుకుని చెంచుగూడెం వెళ్ళిపోయారు.

మరునాడు చెంచుగూడెంలో వున్న పి హెచ్ సి మెడికల్ ఆఫీసరు భీమశంకరం, తక్కిన ముగ్గురు డాక్టర్లు. జరిగిన విషయం గిరిజన యువకుడివల్ల తెల్సుకుని పి. హెచ్. సీకి బయల్దేరి వెళ్లారు.

వాళ్ళు అక్కడికి చేరి, తప్పిపోయిన డాక్టర్ల గురించి ఎంక్వయిరీ చేస్తూండగానే డిఎమ్‌హెచ్‌వో, సిబ్బందితో బయల్దేరి రావటం జరిగింది.

జరిగిన నష్టాన్ని, ప్రాణనష్టాన్ని స్వయంగా తిలకించిన ఆ జిల్లా అధికారి చాలాసేపు దిగ్భ్రాంతినుంచి తేరుకోలేకపోయాడు.

ముఖ్యంగా, కనిపించకుండా పోయిన డాక్టర్ల విషయం ఆయన్ని డైలమాలో పడేసింది.

రామన్న గూడెంలోను, వద్దెగ గూడెంలోను, చెంచుగూడెంలోను పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చింది. అక్కడ కొత్త కేసులేవీ రిపోర్టు కాలేదు. వ్యాధి సోకిన వాళ్ళలో చికిత్స చేయబడ్డవాళ్ళు త్వరితగతిని కోలుకుంటున్నారు.

డిఎమ్‌హెచ్‌వో మిస్సయిన డాక్టర్లని వెతకటానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తూండగానే పిడుగులాంటి వార్త వచ్చింది.

అక్కడికి ఎనిమిది కిలోమీటర్ల మార్గంలో వున్న చిలకల గూడెంలో విషజ్వర కేసులు పది అవుట్ బ్రేక్ అయ్యాయి!

అంతే! డిఎమ్‌హెచ్‌వో తన వెంట తీసుకొచ్చిన ఆరుగురు డాక్టర్లను. చిలకల గూడెం పంపించాడు.

ఆ టెండర్ని మా రేడుమిల్లి పంపించి, అక్కడినుంచి

జిల్లా హెడ్ క్వార్టర్స్‌కి మెసేజ్ పంపించాడు ఫోన్ ద్వారా. వెంటనే ఓ ఇరవై మంది డాక్టర్లని వివిధ పి హెచ్ సీల నుంచి డెప్యూటేట్ చెయ్యమని డిప్యూటీ డిఎమ్ హెచ్ వోకి మెసేజ్ పంపాడు. మందులతో సిద్ధంగా రమ్మని.

ఆయన సర్వీస్‌లో ఇది చాలా విచిత్రమైన వ్యాధి. ఓపక్క ఎపిడెమిక్ తమ శాఖను సవాల్ చేస్తూంటే, మరోపక్క జాడ తెలియకుండా పోయిన డాక్టర్ల అంతర్ధానం ఓ పజిల్‌లా తనని భయపెడుతోంది.

మధ్యాహ్నానికి డాక్టర్లను వెతకటానికి వెళ్ళిన గిరిజన యువకులు అడవంతా గాలించి వచ్చి చెప్పారు—కనిపించలేదంటూ.

డిఎమ్ హెచ్ వో అప్పటికప్పుడే ఓ నిర్ణయానికొచ్చాడు అయితే ఈలోపల చిలకల గూడెంలో ఎపిడెమిక్ కంట్రోల్ కావటంలేదని కబురొచ్చింది.

డిఎమ్ హెచ్ వోకి పరిస్థితి అంతా అగమ్యగోచరంగా అనిపించింది. అదనపు సిబ్బందిని పక్క జిల్లాలనుంచి, జిల్లాలోని తాలూకా హాస్పిటల్స్‌నుంచి రప్పించాలి. ప్రాణరక్షణ మందుల్ని కూడా తెప్పించాలి!

డిఎమ్ హెచ్ వో మెదడులో ఓ ప్లాన్ వెలిగింది.

అవును! ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆయనయితే నే తనని ఒడ్డెక్కించగలడు!

ఈ ఆలోచన వచ్చాక మరుక్షణంకూడా వృధా కానివ్వలేదాయన. జీప్‌లో మారేడుమిల్లి వెళ్ళాడు.

జిల్లా హెడ్ క్వార్టర్స్‌కి ఫోన్ చేసి డెప్యూటీ డిఎమ్ హెచ్ వోతో మాట్లాడి, మరో యిరవై మంది డాక్టర్లని, ప్రాణరక్షణ మందుల్ని వెంటనే పంపించమని చెప్పాడు.

తర్వాత మరో నంబర్‌కి డయల్ చేశాడు.

అట్నుంచి సమాధానం వచ్చింది.

"హాల్లో, డిటెక్టివ్ కిరణ్ గారున్నారా?" అనడిగాడు డిఎస్‌పి హెచ్‌వో ఆత్రుతగా.

"లేరండి. ఓ కేసు పరిశోధన నిమిత్తం నాగపూర్ వెళ్ళారు. ఇంకా రాలేదు."

"మీరు ....!?"

"లాయర్ బిందు కిరణ్."

"అలాగా, సుస్సే లాయర్ గారూ! కిరణ్ యెప్పుడొస్తారో చెప్పగలరా? చాలా అర్జంటు."

"రెండు మూడు రోజుల్లో రావచ్చు. లేదా ఈ రాత్రికే రావచ్చు పనయిపోతే! చెప్పలేం. ఏం కావాలో చెప్పండి."

"నేను డిఎస్‌పి హెచ్‌వోని మాట్లాడుతున్నాను........"

అంటూ వివరాలు చెప్పాడు.

అట్నుంచి కొద్దిక్షణాలు నిశ్శబ్దం. తర్వాత, "నోట్ చేసుకున్నాను. వచ్చాక చెప్తాను" అన్నది లాయర్ బిందు.

"థాంక్యూ!" అంటూ ఫోన్ క్రెడిల్ చేశాడాయన.

'కిరణ్ వచ్చేలోపల తను చెయ్యాల్సిన పనులు వేరే వున్నాయి. ముందు చిలకల గూడెం వెళ్ళి అక్కడి కేసుల్ని వరిఫై చెయ్యాలి' అనుకున్నాడు.

ఓ ఆర్డెండర్ని, ఇన్స్పెక్టర్ని, మఫ్టీ పర్సన్ వర్కర్సు ఇద్దర్ని వెంటబెట్టుకొని చిలకలగూడెం బయల్దేరాడు జీప్‌లో.

దాదాపు నాలుగు కిలోమీటర్ల వరకు జీప్ బాగానే వెళ్ళింది. ఆ తర్వాత దారి సుగమంగా లేదు. జీప్ వెళ్ళ

నంత ఇరుకు దారి. వెంట ఓ గిరిజన యువకుడు వెళ్ళాడు.

"ఇక నడవదు సార్! బాగా నేరో రోడ్!" చెప్పాడు డ్రైవర్. గిరిజన యువకుడు తలూపాడు.

"ఇంకా నాలుగు కిలోమీటర్ల దూరముంది సార్! కాలినడకనే వెళ్ళాల్సి వుంటుంది" మల్టీపర్పస్ వర్కర్లు చెప్పారు.

గిరిజన యువకుడు "అవున్దొరా. నే దారి చూపిస్తా, రండి" అన్నాడు.

డ్రైవర్ కూడా బయల్దేరాడు.

ముందు గిరిజన యువకుడు దారి చూపుతుంటే వాడి వెనక మల్టీపర్పస్ వర్కర్ల మధ్య డిఎమ్హెచ్వో, ఆయన వెనక అటెండర్, డ్రైవర్ నడుస్తున్నారు.

సరిగ్గా అప్పుడే పెద్దపులి గాండ్రింపు వినిపించింది. అందరికీ గుండెలు ఝల్లుమన్నాయి.

పులి చాలా సమీపంలో వుందని దాని గాండ్రింపు ధ్వనిని బట్టి నిర్ధారణ అయింది. ఏ క్షణంలోనైనా అది తమమీద విరుచుకు పడొచ్చు.

గిరిజన యువకుడు నిల్చుండిపోయాడు.

"మెకం కానా దగ్గరసా వొచ్చినా ద్దొరా! బయం పడమాకండి. నాదరి బరిసె వుండాది గదా, ఏటాడతాను" అన్నాడు.

అయితే అతను బరిసె చేతిలో వాటంగా పట్టుకుంటుండగానే, అమాంతం పొదల్లోంచి పులి అతనిమీద వురికింది.

చేతిలోని బరిసె ఎగిరి అవతలపడింది. పులి అతని ఛాతీమీద, ముఖంమీద పంజాతో కొట్టింది. అతను కలియబడ్డాడు.

ఈలోపల అటెండర్, డ్రైవర్ వగయిరా స్టాఫ్ కకావికలుగా చెదిరిపోయారు.

సరిగ్గా అప్పుడే, ఎటూ పోకుండా నిర్ఘాంతపోయి నిల్చుండిపోయిన డిఎమ్‌హెచ్‌వోమీద నైలాన్ వల పడింది. దాన్నుంచి తప్పించుకోవటానికి ఆయన ప్రయత్నించేలోపల, ఆ వల చెట్టుపైకి గబగబ చేరుకోబడింది.

పులి ఆ గిరిజన యువకుడి కంఠం చీల్చి చంపేసి పొదల్లోకి లాక్కుపోయింది.

10

తెల్లవారి పదిగంటల పొద్దెక్కినా తమని ఆ బందిఖానానుంచి కాలకృత్యాలకుకూడా వదలకపోవటంతో తమను బంధించిన వ్యక్తి ఎంతటి క్రూరుడో అర్థమయిపోయింది నాథ్ బృందానికి.

విఠల్ అసహనంగా హాల్లో అటు యిటు పచార్లు చేస్తూన్నాడు. సందీప్ తమ కారణంగా అంతమంది డాక్టర్లని ఇబ్బందులకు గురిచేసినందుకు చాలా బాధపడుతున్నాడు. సురేఖ మొదలైన డాక్టర్లంతా దీర్ఘంగా ఆలోచిస్తూన్నారు—పరిస్థితినెలా ఎదుర్కోవాలా అని!

“వీళ్ళ అంతర్యం ఈ పాటికి మీకర్థమయ్యే వుంటుంది. మనకు అన్నపానీయాలు అందకుండా చేసి, ఆకలితో మలమలమాడి చావాలని అతని ఉద్దేశ్యం” అన్నాడు నాథ్.

విఠల్ తలూపి, “కరెక్ట్! మనల్ని యిలాంటి ఆయుధంతోను చంపకుండా, మనంతమనమే చావాలని ఇతని కోరిక” అన్నాడు.

సురేఖ సాలోచనగా వాళ్ళవైపు చూసి, “నాకైతే అది సరైన కారణమనిపించటంలేదు. ఇతను మనల్ని

చంపాలనే ఉద్దేశ్యంలో లేదు. ఇతనే చంపాలనుకుంటే మనల్ని ఇంతదూరం శ్రమపడి తీసుకురావాల్సిన పనిలేదు. అడవిలోనే అంతం చేసి వుండేవాడు. ఆ ఉద్దేశ్యమే లేనప్పుడు మనల్ని ఇక్కడ పెట్టి, మనంతటమనం చావా అని మాత్రం ఎందుకనుకుంటాడు?" అన్నది.

ఆమె హేతువాదం తక్కిన అందరికీ సబబుగానే కనిపించింది. తమను బంధించటంలో అతని ఉద్దేశ్యం వేరే యేదో అయుంటుంది. ఏమిటది? తమతో అతనికేమైనా పనుంటే అన్నపానీయాలు ఇవ్వకుండా చంపటానికి ప్రయత్నించడు.

సరిగ్గా అప్పుడే ఎక్కడ్నుంచో స్పీకర్లో మాటలు వినిపించాయి. "హల్లో ఫ్రెండ్స్! గుడ్ మార్నింగ్! ఎలా సాగా వున్నారా?"

అదే గొంతు హేళనగా ధ్వనించింది.

నాథ్ వెంటనే అడిగాడు. "మిష్టర్, మీరెవరు? ఎందుకు మమ్మల్ని నిర్బంధించారు? ఏం కోరి మమ్మల్నిలా యెందుకు హింసిస్తున్నారు?"

"డియర్ డాక్టర్! నన్ను! నన్ను ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదని ముందుగానే చెప్పాను. మళ్ళీ చెపుతున్నాను. మిమ్మల్నెందుకు బంధించానో అదికూడా ఇప్పుడు చెప్పను. మిమ్మల్ని ప్రాణాలతో వుంచుతానా లేదా అన్న సంగతికూడా చెప్పను."

వితల్ కి కోపంతో అరికాలమంట నెత్తికెక్కి "ఏం చెప్పకపోతే ఎందుకలా డంబాలు కొట్టుకోవటం? మమ్మల్ని పలకరించకుండా మా మానాన వదిలేయొచ్చు!" అన్నాడు.

"మీరు నా శత్రువులని రక్షించటానికి ప్రయత్నించి

నాకు శత్రువులయ్యారు. నా శత్రువుల నాశనాన్ని కోరుకొనే నేను చావుకి యెంతదూరంలో మీరున్నారో ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటున్నాను" వికటంగా నవ్వాడు.

"మా నాశనాన్ని కోరుకోవటానికి మమ్మల్ని ఇక్కడ బంధించాల్సిన పనిలేదే!?"

"అదే చిదంబర రహస్యం. ప్రాణాలు పోయేవరకు ఆలోచించుకుంటూ వుండండి. బై!"

"ఇంతకీ, వాట్ ఈజ్ యువర్ నేమ్?" అడిగాడు నాథ్.

"నా పేరుతో పనేముంది? పేరే కావాలనుకుంటే మిస్టర్ 'ఎక్స్' అని పిలుచుకోండి!"

11

పి హెచ్ సి ముందు వేన్ ఆగింది.

అందులోనుంచి ఇరవై మంది డాక్టర్స్, పాతికమంది నర్సులు, ఆరుగురు ఎమ్మెన్ వోలు (మేల్ నర్స్ ఆర్డర్లీలు) దిగారు. తమతో బాటు అవసరమైన మందులన్నీ తీసుకొచ్చారు.

పి హెచ్ సిలో ఆ సమయానికి అటెండరు, ఇద్దరు ఏ ఎన్నెమ్‌లు (ఆగ్జిలరీ నర్స్ మిడ్ వైఫ్‌లు) ఓ ఎఫ్ ఎన్ వో వున్నారు.

ఆ డాక్టర్సులో దాదాపు ఆరడుగుల రెండంగుళాల ఎత్తుతో, స్ఫురద్రూపియైన డాక్టరు ముందుకొచ్చి "డిఎమ్ హెచ్ వో గారెక్కడున్నారు?" అనడిగాడు.

ఏ ఎన్నెమ్‌ల్లో ఒకామె చెప్పింది. "చిలకలగూడెంలో కేసుల్ని చూడటానికి వెళ్ళారు సార్! మీరొస్తే అక్కడికి రమ్మని చెప్పమన్నారు."

"అయామ్ డాక్టర్ ధన్వంతరి! మాకు చిలకలగూడెం

వెళ్ళేదారి చూపించాలి!" అన్నాడా డాక్టరు హుందాగా. ఆ టీమ్‌కి అతనే నాయకుడిలాగా వున్నాడు. ఫుల్ సూట్‌లో వున్నాడు. కోటు జేబులోనుంచి స్టెతస్కోపు తొంగిచూస్తోంది.

"అలాగే సర్, పి.హెచ్.సి స్టాఫ్ అందరు డ్యూటీ మీద వెళ్ళిపోయారు. ఆ కొండరు తప్ప అందరు ఆడవాళ్ళే వున్నారు. అతనికి ఆఫీసు వర్క్సు తప్పితే, అడవిలోకి దారి తెలియదు. దగ్గర్లో గిరిజన యువసంఘం నాయకులున్నారు పిలిపిస్తాం, దయచేసి రెస్టుతీసుకోండి కాసేపు" అన్నది రెండో ఏ.ఎన్.ఎమ్.

డాక్టర్ ధన్వంతరి తక్కిన డాక్టర్ను వంక, పారా మెడికల్ స్టాఫ్ వంక చూసి, "కమాన్ డాక్టర్స్! లెటజ్ హావ్ ఎ ఫ్యూ మినిట్స్ రిలాక్సేషన్" అన్నాడు.

అందరు అతన్ని ఫాలో అయ్యారు.

ఈలోపల గిరిజన సంఘ యువనాయకుడికి కబురు వెళ్ళింది. ఇద్దరు యువకులు అయిదు నిమిషాల తర్వాత ధన్వంతరి బృందంముందు హాజరయ్యారు.

ఇద్దరు కాస్త చదువు సంధ్య ఉన్నవాళ్ళలాగానే వున్నారు. కాకపోతే, మాటల్లో యాస కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

"చిలకలగూడెం తీస్కుపోతాం, రండి దొరా!" అన్నారు వాళ్ళు.

ధన్వంతరి లేచాడు. తక్కిన డాక్టర్లుకూడా అతని వెంట లేచి ముందుకు నడిచారు.

"ఎంతదూరముంటుంది?" అడిగాడు ధన్వంతరి.

"దాదాపు రెండున్నర కోసులుంటాద్దొరా!"

"అంటే ఎనిమిది కిలోమీటర్లన్నమాట!" మనసులోనే గుణించుకున్నాడు ధన్వంతరి.

"వేన్ వెళ్ళగలదా?"

"సగందాకా ఎల్లగలుగుద్ది. ఆమీదన దారి బాగోదు."

మందులు తీసుకు వెళ్ళటానికి ఎమ్మెన్ వోలు వున్నారు. అయితే వేన్‌లో కొంతదూరం వెళ్ళి మళ్ళీ అక్కడ్నుంచి మందుల్ని బేగ్స్‌లో సర్దుకుని, వాళ్ళచేత పట్టించుకు పోవాలి!

వేన్‌లో పదిమంది డాక్టర్లు స్టాఫ్ గిరిజన యువకులు కూచున్నారు. అప్పటికే, మందులతో కూడిన వేన్ తగలబడిపోవటం, పి హెచ్ సి మెడికల్ ఆఫీసరు జయదేవ్‌తో బాటు మరో ఇద్దరు డాక్టర్లు అకాల మృత్యువాతపడటం మొదలయిన వివరాలు ధన్వంతరి బృందానికి పి హెచ్ సి అటెండర్ పూసగుచ్చినట్టు చెప్పాడు.

వేన్ నాలుగు కిలోమీటర్లు నడిచేసరికి అంతక్రితం డిఎమ్ హెచ్ వో ప్రయాణించివచ్చిన జీప్ కనిపించింది.

ధన్వంతరి దాన్ని చూస్తూనే డ్రైవర్‌తో "వేన్ స్లో చెయ్యి. నేను దిగుతున్నాను" అన్నాడు. డాక్టర్ల వంక చూసి చిన్నగా సైగచేశాడు. వాళ్ళు అర్థమయినట్టు తలలూపారు.

ధన్వంతరి వేన్ నడుస్తూండగానే మెరుపువేగంతో దిగిపోయి, పక్కనే వున్న గుబురు పొదలవైపు నడిచాడు. అతని చెయ్యి కోటుజేబులో బిగుసుకుని వుంది. ఏ క్షణంలోనైనా ప్రమాదం తనమీద విరుచుకుపడవచ్చునని అతను చాలా అలర్టుగా వున్నాడు.

వేన్ జీప్‌కి సమీపంలో ఆగిపోయింది.

డాక్టర్లు. పారా మెడికల్ స్టాఫ్ కిన్ దిగారు. సంచుల్లో మందులు సర్దుకుని భుజాలకు వేలాడదీసుకున్నారు స్టాఫ్.

గిరిజన యువకులు దారి చూపుతుండగా డాక్టర్లు వాళ్ళని అనుసరిస్తూన్నారు.

వారికి కొంత దూరంలో డాక్టర్ ధన్వంతరి అనుసరిస్తున్నాడు. త్వరలోనే ఏ మూలనుంచో ఎటాక్ ఎదుర్కోవలసి వుంటుందని అతని సిక్స్త్ సెన్స్ చెప్తోంది. చుట్టూ పరీక్షగా చూసుకుంటూ నడుస్తూన్నాడు ధన్వంతరి.

రెండు కిలోమీటర్లు నిరాటంకంగా నడిచి వెళ్ళారు. మరో రెండు కిలోమీటర్లు నడిస్తే చిలకలగూడెం చేరిపోవచ్చు. పొదల మాటునుంచే తనవాళ్ళని అనుసరించి వెళ్తున్నాడు ధన్వంతరి.

మరో కిలోమీటరు నడిచినా ధన్వంతరి ఎదురు చూసిన ప్రమాదమేదీ ఎదురుకాలేదు.

అయితే మరి కొద్దిక్షణాల్లోనే అతనూహించిన ప్రమాదం తమముందుకొచ్చింది. ఇరవైమంది సాయుధులైన ఆటవికులు ఒక్కసారిగా డాక్టర్ల బృందాన్ని చుట్టుముట్టారు.

వాళ్ళని ప్రతిఘటించవద్దని, ధన్వంతరి ముందుగానే తన వాళ్ళకు చెప్పి వుంచాడు. వాళ్ళమీద తిరగబడ్డా నష్టపోయేది తామేనని వాళ్ళకు తెలుసు.

అమాయకంగా ఆటవికులవైపే చూస్తూ, "మీరెవరు? ఎందుకిలా ముట్టడించారు? మేము డాక్టర్లం. చిలకలగూడెం వైద్యం చేయడానికి, వెళ్తున్నాం" అన్నారు.

ఆటవికులు బరిసెలు పట్టా కత్తులు పట్టుకొని యువ

కింకరుల్లా నిలబడి వున్నారు.

“మా వెనకమాలి రాండి, ఎదిరిస్తే సంపేత్తాం” అన్నారు ఆటవికులు.

డాక్టర్ల బృందం వాళ్ళని అనుసరించారు.

దూరంగా పొదలచాటునుంచి ఎవరికీ కనిపించకుండా ధన్వంతరి వాళ్ళని అనుసరిస్తూన్నాడు.

ముందుగానే సగంమంది డాక్టర్లని, పారామెడికల్ స్టాఫ్ని అడ్డతోవన చిలకలగూడెం పంపించటం మంచి దయిందనుకున్నాడు. ప్రమాదం ముందు ఊహించినదే కావటంవల్ల పదిమంది డాక్టర్లను, అయిదుగురు స్టాఫ్ మెంబర్సుని చికిత్స నిమిత్తం పంపించాడు ధన్వంతరి.

ఈపాటికి అక్కడ వ్యాధి తీవ్రతకు చాలావరకు అరికట్టగలిగి వుంటారు డాక్టర్లు.

అయిదు నిమిషాల ప్రయాణం తర్వాత ఆటవికులం నల్లటి గంతల్ని పైకితీసి డాక్టర్ల బృందం కళ్ళకు కట్టారు. మళ్ళీ ప్రయాణం సాగింది.

మరో ఇరవై నిమిషాల తర్వాత ఆటవికులు నిలిచిపోయారు. చుట్టూ పరీక్షగా చూశారు. ఎవరూ గమనించటంలేదని నిర్ధారణ చేసుకున్నాక, గుహకు అడ్డంగా వున్న బండరాతిని తొలగించారు.

బిలం బయటపడింది.

ఆటవికులు సగంమంది ముందువైపు, సగం వెనకవైపు మధ్య డాక్టర్ల బృందాన్ని కవర్ చేస్తూ బిలంగుండా లోనికి తీసుకువెళ్ళారు.

ధన్వంతరి తనూ బిలద్వారం చేరుకుని, కన్ను మూసి తెరిచేలోపల లోపలికి ప్రవేశించి మూలగా దాక్కున్నాడు.

లోపల దేదీప్యమానంగా వెలుగుతున్న అధునాతన కట్టడాన్ని చూసి ధన్వంతరి ఆశ్చర్యపోయాడు. సొరంగంలోంచి లోపల భవనాన్ని నిర్మించటం చాలా కష్టసాధ్యమైన పని!

ఆటవికులు డాక్టర్ల బృందాన్ని ఓ పెద్ద నిడుపాటి హాల్లోకి తీసుకువెళ్లారు. ధన్వంతరి చాలా కామ్‌గా వాళ్ళని వెంబడిస్తూ తనూ హాలు దగ్గరకు చేరాడు.

లోపల గుంపుగా వున్న డాక్టర్లు, పారామెడికల్ స్టాఫ్ కనిపించారతనికి.

ధన్వంతరి వాళ్ళలో నాథ్‌ను, విఠల్‌ని, సురేఖను, సంజీవిని గుర్తుపట్టాడు. తక్కిన డాక్టర్లను అతను ఎరగడు.

ఆటవికులు ఇనపగేట్లు కొద్దిగా తెరిచి తాము తీసుకొచ్చిన పదిమంది డాక్టర్లని, అయిదుగురు పిహెచ్‌సి సిబ్బందిని లోపలికి దాదాపు గెంటుతున్నట్టుగా తోసి మళ్ళీ గేట్లు వేసేశారు.

ధన్వంతరి ఆ బృందంలో వున్న డిఎమ్‌హెచ్‌వోని గుర్తుపట్టాడు. ఓ పక్కగా అటు తిరిగి వున్నందున వెంటనే గుర్తుపట్టలేకు మొదట.

అంటే, మొదటవచ్చిన డాక్టర్ల బృందాన్ని, డిఎమ్‌హెచ్‌వోని కూడా ఇక్కడికే తీసుకువచ్చారన్నమాట! ఇప్పుడు మూడో బేచ్‌ని కూడా ఇక్కడికే తెచ్చారు.

దీని వెనకవున్న హస్తం ఎవరిది? ఎందుకు డాక్టర్లనిలా బంధిస్తున్నాడు?

ధన్వంతరి - విఠల్, నాథ్, సురేఖ మొదలైన వాళ్ళందరి ముఖాలు బాగా వాడిపోయి నీరసంగా వుండటాన్ని గమనించాడు. తిండిలేక నకనకలాడుతున్నట్టుగా

కనిపించారు.

డిఎమ్‌హెచ్‌వోతో బాటు తక్కిన డాక్టర్లంతా కొత్తగా వచ్చిన డాక్టర్లవైపు సానుభూతిగా, ఆప్యాయంగా చూశారు. వాళ్ళందరు గతంలో ఒకరికొకరు బాగా తెలిసినవాళ్ళే! కుశల ప్రశ్నలు వేసుకుంటున్నారు.

ధన్వంతరి చుట్టూ పరిశీలనగా చూస్తూన్నాడు. అంత వరకు వాళ్ళని వెంటనంటి వున్న ఆటవికులు లోపలి గది లోకి వెళ్ళి పదినిమిషాల తర్వాత బయటికొచ్చి బిల ద్వారంవైపు వేగంగా నడుచుకుంటూ వెళ్ళిపోయారు.

ధన్వంతరి వాళ్ళు వెళ్ళొచ్చిన గదివైపు నడిచాడు మెల్లగా. లోపలంతా లైట్ల వెలుగు. తను పొరపాటున యెవరికంట పడినా మరుక్షణం తన శరీరంనుంచి ప్రాణాలు వేరయిపోతాయని అతనికి తెలుసు.

అందుకే చాలా కాషస్‌గా ప్రవర్తిస్తున్నాడు అతని కుడిచేయి కోటుజేబులోని రివాల్వర్ మీద బిగుసుకుని వుంది. ప్రమాదం యే రూపంలో విరుచుకుపడుతుందో అనూహ్యం!

అక్కడ ధన్వంతరికి మూసి వున్న తలుపులుమాత్రమే కనిపించాయి.

ధన్వంతరికి అలాంటి తలుపులున్న గదులు అదే వరసలో మరో రెండు కనిపించాయి.

వాటిని చూడాలంటే ఈ గది ముందునించే వెళ్ళాలి! తన ఊహే నిజమైతే, ఆ గదిలో ఈ గూడుపుఠాని చేస్తూన్న వ్యక్తిగాని, అతనికి సంబంధించిన వాళ్ళుగాని వుండాలి!

ధన్వంతరి మొండిధైర్యంతో అటు వెళ్ళాడు. తలుపులు

మూసే వున్నాయి. లోపల ఎవరున్నారో, యేమున్నాయో తెలీదు.

ఆ గదికి ఆవలగా వున్న గదులవైపు నడిచాడు ధన్వంతరి. తలుపులు నెట్టాడు, తెరుచుకో లేదు. రెండో గది తలుపులు కూడా నెట్టాడు అవీ తెరుచుకో లేదు.

లోపల్నుంచి గడియ పెట్టి ఉన్నాయేమోనని చూశాడు కాని అవి బయట్నుంచి గడియ పెట్టుకుని లాక్ చేసుకునే పద్ధతిలో వున్నాయి.

గదిచుట్టూ పైభాగంలో వెంటిలేటర్స్ వుండటం గమనించాడు' సొరంగంలో కట్టిన గదులకి మళ్ళీ పై భాగంలో వెంటిలేటర్సేమిటి?

చిన్నగా నవ్వుకున్నాడు ధన్వంతరి.

ఓ పక్కనున్న వెంటిలేటర్ని గోడమీదుగా పైకెగబాకి లోపలికి తొంగిచూశాడు.

ధన్వంతరికి ఆశ్చర్యంతో నోట మాటరాలేదు.

12

అది ఒక లాబరేటరీ!

దాదాపు ముప్ఫయిమంది యువకులు తమముందు మైక్రోస్కోపులు పెట్టుకుని తదేకదీక్షతో గాజు పలకలను (స్లైడ్స్) మైక్రోస్కోపు కింద పెట్టుకుని తీవ్రంగా పరిశీలిస్తున్నారు.

ఒక స్లైడ్ తర్వాత మరొకటిగా చాలా స్లైడ్స్ వాళ్ళముందు గుట్టగా పేర్చబడిన బండిల్స్ లోనుంచి తీసి పరీక్ష చేశాక పెన్సిల్ తో దానిమీద నంబరు వేసుకుని వాటిని పక్కన పెడ్తున్నారు.

కొన్నిటిమీద పాజిటివ్ (+) అని, మరి కొన్నిటి మీద నెగటివ్ (—) అని రాసుకుంటున్నారు. పరీ

క్షించటం ముగిసిన వెంటనే పొడవాటి రెండు పుస్తకాల్లో నంబరు రాసుకుని పరిశోధన ఫలితాన్ని రిజిష్టర్ చేస్తున్నారు.

ధన్వంతరి చాలాసేపు ఆశ్చర్యంనుంచి తేరుకోలేక పోయాడు.

ఏమిటా సైన్సు? ఇంత రహస్యంగా, ఈ మాయమూల అడవిప్రాంతంలో సారంగంలో వెలసిన ఈ లాబరేటరీ ఏమిటి? ఎవరు దీన్ని నడుపుతున్నారు!?

ఈ యువకులెవరు? వీళ్ళు చేస్తూన్న ఈ పరీక్షలు దేని గురించి? గూడేల్లో వ్యాపిస్తూన్న విషజ్వరానికి, చావులకి, వీళ్ళ పరిశోధనలకి ఎలాంటి సంబంధముంది?

ఎక్కడో లింక్ వున్నట్లనిపిస్తోంది ధన్వంతరికి.

యువకులందరూ పాతికేళ్ళలోపు వయసువారే. బాగా చదువుకున్న వాళ్ళలాగే వున్నారు. బహుశా సైన్సు గ్రాడ్యుయేట్స్, పోస్టు గ్రాడ్యుయేట్స్ అయ్యుంటారు.

మెల్లగా వెంటిలేటర్నుంచి కిందికి దిగి పక్క గది దగ్గరకు వెళ్ళాడు. అక్కడకూడా వెంటిలేటర్సున్నాయి. ఓ వెంటిలేటర్ని సెలక్టు చేసుకున్నాడు. పైకెక్కి గది లోపలికి తొంగిచూశాడు.

మరో లాబరేటరీ! రసాయనిక ప్రయోగశాల.

దాదాపు పన్నెండు అడుగుల పొడవు, నాలుగడుగుల వెడల్పు వున్న బల్లలమీద బీకర్లు, పరీక్ష నాళికలు, సీసాల్లో రసాయన పదార్థాలు—అంగుళం ఖాళీలేకుండా బల్లలు నిండిపోతున్నాయి.

దాదాపు ముప్ఫయిమంది యువకులు తెల్ల ఏప్రన్స్ వేసుకుని, నిల్చుని పరీక్ష నాళికల్లోని రసాయనాలను

దీపపు కాంతికి అభిముఖంగా పెట్టి పరీక్షిస్తున్నారు.

ఎప్పటికప్పుడు రీడింగ్సు, ఫైండింగ్సు పొడవాటి లోక పుస్తకంలో రాసుకుంటున్నారు.

ఆ శోధనా నాళికల్లోని రసాయనాలేమిటి? వాళ్ళక్కడ చేస్తున్న ప్రయోగాలేమిటి?

ధన్వంతరి మస్తిష్కం ఆలోచనలతో వేడెక్కి పోయింది.

ఏవో కొన్ని సమాజ విద్రోహ శక్తులకి ఉపయోగపడే పరిశోధనలయి వుంటాయి. ప్రపంచ కళ్యాణానికి కాక వినాశనానికి దోహదం చేసే పరిశోధనలయి వుంటాయి.

అందుకే.... అందుకే... ఇంత మారుమూల ప్రాంతంలో సారంగంలో జరుగుతున్నాయి ఈ ప్రయోగాలు. ఖచ్చితంగా లోకవినాశనానికి ఉద్దేశింపబడ్డ పరిశోధనలే ఇవి!

అయితే, ఆ దేమిటి?

అదేమిటో తను తెలుసుకోవాలి.

ఇంతమంది డాక్టర్లని ఇక్కడ బంధించి వీళ్ళేం సాధించబోతున్నారో తను పరిశోధించి తెల్సుకోవాలి. వీళ్ళతో ముఖాముఖి పోట్లాడవలసివచ్చినా తను వెనుకంజ వెయ్యడు.

ధన్వంతరి పిడికిళ్ళు బిగుసుకున్నాయి. అతని దవడ కండరం బిగుసుకుంది. దృఢనిశ్చయంతో అతని రక్తం వేడెక్కి పొంగి పొరలింది.

వెంటిలేటర్ నుంచి కిందికి దిగాడు. మొదటి గది దగ్గరకొచ్చాడు. ఇందాకా ఆటవికులు ఆ గదిలోకి వెళ్ళి పదినిమిషాల్లో బయటికొచ్చి మళ్ళీ బిలం మార్గంగుండా అడవిలోకి వెళ్ళిపోవటం తను చూశాడు.

ఆ గదికి కూడా వెంటిలేటర్స్ వుండటం గమనించాడు ధన్వంతరి.

మెల్లగా పైకి ఎగబ్రాకి లోనికి తొంగిచూశాడు.

లోపల రెండే రెండు టేబిల్స్ వున్నాయి. ఓ టేబిల్ ముందు చాలా అందంగా వున్న యువతి కూచుని వుంది.

ఆమె వయసు ఇరవై ఇరవై రెండుకన్నా మించి వుండదు. గులాబి రంగు శరీరం. చక్కటి అవయవ సౌష్ఠవం. పొంకంగా బింకంగా వుంది. చూడగానే ఇనపకచ్చడాలలో బిగించుకున్న మహార్షులనికూడా ఉద్రేకంతో రెచ్చగొట్టేలా వున్నాయి అవయవాల ఎత్తు పల్లాలు.

ఆమె తదేకదీక్షతో తన ముందున్న టి.వి. స్క్రీన్ మీద రీడింగ్స్ నోట్ చేస్తోంది.

ఎలక్ట్రానిక్ తరంగాలు పీప్ ....పీప్ ....మంటూ చిన్న శబ్దంతో టి.వి. తెరమీద అలా మెరిసి ఇలా మాయమవుతున్నాయి.

ఆ స్ప్లిట్ సెకండ్‌లోనే ఆమె ఫైండింగ్స్ నోట్ చేస్తోంది కొన్నిసార్లు నంబర్స్ మరికొన్నిసార్లు ఇంగ్లీషు అల్ఫాబెట్స్ మరోసారి చుక్కలు, గీతలు—ఇలా రకరకాలుగా షార్టుహేండ్ స్క్రిప్టులా కనిపిస్తున్నాయి తెరమీద.

ఆమె చూపు నిశ్చలంగా తెరవైపే వుంది. ఆమె చేతులు యాంత్రికంగా పుస్తకంలో ఏదో రాస్తూనే వున్నాయి. ఆమె కళ్ళుమాత్రం తెరమీదనే లగ్నమై వున్నాయి.

రెండో టేబిల్ ముందు ఓ నలభైయిదేళ్ళ మగాడు కూచుని వున్నాడు. అతని గడ్డం మీసాలు ఓ క్రమపద్ధతి

లేకుండా పెరిగిపోయున్నాయి.

పాంటు, షర్టు వేసుకున్నాడు. పొడుగు చేతుల షర్టును మోచేతులవరకు మడచుకున్నాడు. బాగా చదువుకున్న వాడిలాగానే వున్నాడు.

అతని ముందున్న టేబిల్ మీద వైర్లెస్ అపరేటస్ వుంది. ఓపక్క మైక్రోఫోన్, ఏంప్లిఫయర్ వంటి సాధనాలున్నాయి. ఎడమపక్క టెలెక్స్ సాధనముంది. దానిలో నిర్విరామంగా యేవో సంకేతాలు టకటక మంటూ టైప్ అయిపోతున్నాయి.

ధన్వంతరికి మస్తిష్కంలో ఫ్లాష్ వెలిగింది.

ఆ వ్యక్తి మిష్టర్ ఎక్స్‌గా డాక్టర్ల బృందానికి పరిచితుడు.

అతను చేస్తూన్న పనేమిటో చూచాయగా గ్రహించాడు ధన్వంతరి. ఎక్కడున్నుంచో అతనికి రహస్య సంకేతాలు అందుతున్నాయి. అతను వాటిని రిసీవ్ చేసుకుని డీకోడ్ చేసుకుంటున్నాడు. అలాగే తను పంపించాల్సిన సంకేతాల్ని కూడా కోడ్ భాషలో పంపుతున్నాడు.

ఇంతకీ ఆ సంకేతాలేమిటి? ఎక్కడున్నుంచి వస్తున్నాయి? మళ్ళీ ఎక్కడికి పంపుతున్నాడు?

ధన్వంతరి కళ్ళు చిట్లించి టి.వి. తెరమీద దృష్టి కేంద్రీకరించాడు. అతనికేమీ అర్థంకాలేదు. అయితే మధ్య మధ్యలో కెమిస్ట్రీ ఈక్వేషన్స్ మాత్రం ఇంతలో అంతలో మాయం కావటం గమనించాడు.

రసాయనిక ప్రయోగాల్లో అలాంటి ఈక్వేషన్స్ ఉపయోగిస్తారు. జరుగుతున్న ప్రయోగాలుకూడా రసాయనిక ప్రయోగాలే కాబట్టి వాటికి సంబంధించిన ఇన్ఫర్మేషన్ కోడింగ్ అండ్ డీకోడింగ్ జరుగుతోందక్కడ.

మిష్టర్ ఎక్స్ ముందున్న వైర్లెస్ అపరేటస్‌నికూడా పరిశీలనగా చూశాడు ధన్వంతరి. ఏమీ అర్థంకాలేదు. డీకోడ్ చెయ్యాలి! చేస్తే అర్థంకావటం కష్టంకాదు. అయితే వాటిని ముందుగా వివరంగా కాగితంమీద నోట్ చెయ్యాలి!

మెదడులో కొంతవరకు రికార్డు చేయవచ్చునుగాని, చాలా వేగంగా మారిపోతున్నాయి రీడింగ్స్ ఒకదాని వెంట మరొకటి సీరియాటమ్‌గా జరిగిపోతున్నాయి. కాగితం, కలం లేకుండా డీకోడ్ చెయ్యటం కష్టమే!

ధన్వంతరి చెవులకి షార్ప్‌గా యేదో శబ్దం వినిపించింది తల తిప్పి చూశాడు.

లోపలకు బిలం మార్గంగుండా ఎవరో వస్తూన్నారు.

వాళ్ళు తనని చూసే ప్రమాదం లేకపోలేదు. కాని.. తను తప్పించుకోవటాని కేమాత్రం వీలులేదు. తప్పించుకునే ప్రయత్నంచేస్తే వాళ్ళ కళ్ళముందు పడిపోతాడు. దిగకుండా అక్కడే గోడకి అంటిపెట్టుకుని వుండటమే శ్రేయస్కరం! వాళ్ళ కళ్ళలో పడకుండా దాక్కోవటానికి ఏభై శాతం అవకాశాలున్నాయి!

ఛాన్సెస్ ఫిఫ్టీ ఫిఫ్టీ! అలాంటప్పుడు ఏదైనా ఒకటే. దిగకూడదని నిర్ణయించుకున్నాడు ధన్వంతరి.

ఆటవికులు బాగా దగ్గరగా వచ్చేశారు.

13

"మీరు కూడా ఎలా వీళ్ళకు దొరికిపోయారు? మమ్మల్ని బంధించిన విషయం మీకెవరికీ కనీసం అనుమానం కూడా రాలేదా?" అడిగాడు నాథ్.

ధన్వంతరి బృందంలోని డాక్టరు నిర్లిప్తంగా నవ్వి, "ఉద్యోగ ధర్మం! చిలకలగూడెంలో అవుట్ బ్రేక

యింది ఎపిడెమిక్. డిఎమ్ఎచ్వోగారు మాకు ఫోన్లో మెసేజ్ పంపారు. వెంటనే బయల్దేరి వచ్చాం...."

అంటుండగా డిఎమ్హెచ్ఓ కల్పించుకుని, "నేను ఇరవై మందిని రమ్మని ఫోన్ చేశానే...." అన్నాడు. ధన్వంతరి బృందంలోని డాక్టర్ అయన్ని మెల్లగా భుజంమీద గిచ్చాడు.

డిఎమ్హెచ్ఓ షార్ప్గా రియాక్టయ్యాడు.

ఆ డాక్టర్ చెప్పాడు, "మీరు చెప్పినది కరెక్టే సర్, కాని, ఎమర్జన్సీ కేసు లుండటంవల్ల పదిమంది మాత్రమే ప్రస్తుతానికి రాగలిగాం."

మరో పదిమంది కూడా తమతోనే వచ్చారని. ధన్వంతరి సలహా మేరకు రహస్యంగా చిలకలగూడెం వెళ్ళి ట్రీట్మెంటు మొదలు పెట్టారని. మిస్టర్ ఎక్స్కి ఆ విషయం తెలిస్తే, చిలకలగూడెంలోని రోగుల ప్రాణాలు దక్కవనీ ఆ డాక్టరు డిఎమ్హెచ్ఓతో నిజాన్ని చెప్పకుండా మరుగుపరచాడు.

అందుకే భుజంమీద సంకేతసూచకంగా గిల్లాడు. డిఎమ్హెచ్ఓ అర్థం చేసుకుని మళ్ళీ రెట్టించలేదు.

అక్కడ వాళ్ళు మాట్లాడుకున్న మాటలన్నీ మిస్టర్ ఎక్స్కి స్పష్టంగా వినిపించే యేర్పాటు వుంటుందని అక్కడి డాక్టర్లందరికీ తెలుసు! తాము పొరపాటున నిజాలు మాట్లాడుకోకూడదని వాళ్ళకి తెలుసు.

డిఎమ్హెచ్ఓ చెవిలో రహస్యంగా యేదో చెప్పాడా డాక్టరు. అతని పేరు రవీంద్ర.

రవీంద్ర చెప్పిన విషయం వినగానే డిఎమ్హెచ్ఓ మనసు ఆనందంతో గంతులు వేసింది. అయితే ఆయన తన ఆనందాన్ని ముఖంలో ప్రతిఫలించకుండా జాగ్రత్త తీసు

కున్నాడు. తమ హావభావాల్ని, ఎక్కడ్నుంచో మిస్టర్ ఎక్స్ గమనిస్తూనే వుంటాడని, ఇంత ఆధునాతనంగా కట్టిన బిల్డింగ్‌లో టి.వి. షార్ట్ సర్క్యూట్ అమర్చకో కుండా వుండదని ఆయనకు తెలుసు.

అందుకే సాధ్యమైనంతవరకు తమ మనసులో చెల రేగుతున్న సంక్షోభాన్ని బయటపడకుండా అందరు జాగ్రత్తపడుతున్నారు.

డిఎమ్‌హెచ్ఓ సంతృప్తిగా తలూపాడు.

14

ఆటవికులు సరిగ్గా తను వెంటిలేటర్ దగ్గర చిక్కుకు పోయిన గదిలోపలకు వెళ్ళారు.

డాక్టర్ ధన్వంతరి సరిగ్గా అదే సరయిన అదనుగా చటుక్కున దిగిపోయి క్రిందగా వున్న మారుమూల ప్రాంతంలో దాక్కుని ఆటవికులు వెళ్ళేవరకు యెదురు చూస్తూ నించున్నాడు.

ఓ అయిదునిమిషాల తర్వాత ఆటవికులు బిలద్వారం గుండా బయటకు వెళ్ళిపోయారు.

ధన్వంతరి తర్వాతేం చెయ్యాలో వేగంగా ఆలో చించుకుని ఓ నిర్ణయానికొచ్చాడు.

ముందు వాళ్ళు చేస్తున్న ప్రయోగాలేమిటో చూడాలి! మైక్రోస్కోపుల్లో పరీక్షిస్తున్న స్లైడ్స్ యేమిటో, పరిశీలించాలి. వాటిద్వారా తనకి కొన్ని ఆధారాలు దొరకొచ్చు. అయితే వాళ్ళు అంతమంది ప్రయోగ శాలల్లో ఉండగా తను లోపలికి ప్రవేశించటం దుస్సాధ్యం!

ధన్వంతరి వాచీ చూసుకున్నాడు.

రాత్రి ఎనిమిది గంటలు!

కనీసం భోజనాలకయినా ఆ యువకులు లేకుండా వుంటారా? అదే తనకి సరైన సమయం!

అయితే యిప్పట్లో వాళ్ళు లేచే సూచనలు కనిపించటంలేదు.

ధన్వంతరి యిలా ఆలోచిస్తూండగానే హాలుకి చేర్చి వున్న మరో గదిలో గలగల ధ్వనులు వినిపించాయి. ఒకేసారి అనేకమంది మాట్లాడుకుంటున్న సవ్వడి అది.

ప్లేట్లు, గ్లాసులు చప్పుళ్ళవుతున్నాయి. నవ్వుతూ, తుళ్ళుతూ, మాట్లాడుకుంటున్న శబ్దాలు స్పష్టంగా వినిపించాయి.

ధన్వంతరి ఆ చప్పుళ్ళను సరిగ్గానే అంచనా వేశాడు. వాళ్ళు భోజనాలకి వెళ్తున్నారు.

హాలుకి చేర్చివున్న గదులు వంటశాల, డైనింగ్ హాలు కావచ్చునని అర్థం చేసుకున్నాడు.

ఇదే సరయిన అదను!

ధన్వంతరి తను మొదట చూసిన మైక్రోస్కోపుల గదికి వెళ్ళాడు.

గదితలుపులు నెట్టాడు, తెరుచుకోలేదు.

ఆ పక్కనుంచి వాళ్ళందరు డైనింగ్ హాల్లోకి వెళ్ళివుంటారు. రెండోవైపు ద్వారంగుండా ప్రయత్నించాలి. అవి తెరిచేవుండొచ్చు.

ధన్వంతరి అంచనా తప్పలేదు.

గది రెండోవైపు తలుపులు దగ్గరగా మూసివున్నాయి.... నెట్టాడు. చిన్న శబ్దంతో తెరుచుకొన్నాయి.

ధన్వంతరి చాలా వేగంగా తన పని మొదలు పెట్టాడు. వాళ్ళు భోజనాలు ముగించుకొని మళ్ళీ యే క్షణంలో

సైనా రావచ్చు! యీ లోపల తన పనిని ముగించు కోవాలి!

టేబిల్సుమీద వరసగా పేర్చివున్న మైక్రోస్కోపు లను సమీపించాడు.

స్లైడ్స్‌ని పరీక్షించాడు.

అవి 'స్టెయినింగ్' చేయబడిన గాజు పలకలు.

మైక్రోస్కోపు కిందపెట్టి, లెన్సు, లైటింగ్ అడ్జెస్టు చేసి పరీక్షించాడు ధన్వంతరి.

దానిక్రింద స్ప్రింగులా వున్న 'బాక్టీరియా' (వ్యాధి కలిగించే సూక్ష్మక్రిములు) కనిపించాయి.

ధన్వంతరి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

మరికొన్ని స్లైడ్సు పరీక్షించి చూశాడు. ఒకదాని కన్నా మరొకటి సూక్ష్మజీవుల సంఖ్యలో గణనీయమైన పెరుగుదల కనిపించింది.

ధన్వంతరి మెదడులో ఫ్లాష్ వెలిగింది.

అంటే.... ఈ సూక్ష్మజీవులు....విషజ్వరాన్ని కలిగి స్తూన్న 'వైరస్' అన్నమాట. వీటిని మైక్రోస్కోప్ కింద పరీక్ష చేసిన క్రిమి వివిధ దశల్ని రికార్డు చేస్తు న్నారు.

ఎందుకు?

జవాబు తట్టింది. కాని దాన్ని ఇంకా ఎనలైజ్ చేసు కోవాలి. సరైన కారణాన్ని సహేతుకంగా సాక్ష్యాధా రాలతో నిరూపించగలగాలి. అప్పుడు దానికి తిరుగులేని జవాబు దొరుకుతుంది.

తక్కువ మైక్రోస్కోప్‌లు కూడా చకచక చెక్ చేశాడు ధన్వంతరి. అవన్నీ 'స్టెయిన్' చేయబడ్డ గాజు పలకలే!

ధన్వంతరి రెండో గదిలోకి వెళ్ళాడు.

అక్కడి యువకులు కూడా భోజనాలకి వెళ్ళినట్టున్నారు. స్టూల్స్ ఖాళీగా వున్నాయి.

బల్లమీద బీకర్లు, పరీక్షనాళికలు, గంట జాడీలు (బెల్ జార్స్), రసాయనాల సీసాలు, పేర్చబడి ఉన్నాయి.

పరీక్షనాళికల్ని ట్యూబ్ లైట్సుకి అభిముఖంగా పెట్టి, అంతక్రితం ఆ యువశాస్త్రజ్ఞులు పరీక్షించిన విధంగా పరీక్షించి చూశాడు.

ధన్వంతరి కళ్ళు దిగ్భ్రాంతితో పెద్దవయ్యాయి.

పరీక్షనాళికలో సజీవంగా వున్న బాక్టీరియా కనిపించింది. పరీక్షనాళికల లోపలి గోడలకి, అంటుకొని పెరుగుతున్న తెల్లటి పదార్థం కనిపించింది. అది బూజులా ఉంది! ధన్వంతరికి పరిస్థితి చాలవరకు అర్థమయ్యింది. ఒక్కొక్కటే అనుమాన తెరలు తొలగిపోతున్నట్టుగా అనిపించింది.

లోక పుస్తకాలని తెరిచి చూశాడు.

అందులో 'ఫంగస్' పెరుగుతున్న వివిధ తేదీలకింద వివరాలు ఇవ్వబడ్డాయి.

మరికొన్ని రిజిస్టర్లలో 'వాక్సిన్ ప్రిపరేషన్ ఫార్ములా' గురించి పాయింట్లు ఒకదానికింద మరొకటి తేదీలవారీగా రాయబడి వున్నాయి.

ధన్వంతరి భ్రుకుటి ముడిపడింది. చకచక ఆ ఫార్ములా కాగితాల్ని చించేసి కోటుజేబులోను పర్సు లోపలి భాగంలోను భద్రపరిచాడు. అదేవిధంగా 'ఫంగస్' గురించి రాసిన వివరాల్ని కూడా రిజిస్టర్లనుంచి కాగితాలు చించేసి భద్రపరిచాడు.

సరిగ్గా అప్పుడే "హేండ్సప్!" అంటూ ఓ సింహ గర్జన ద్వారం వైపునుంచి వినిపించి, అదిరిపడ్డాడు ధన్వంతరి.

గుమ్మం వైపు చూసి చేష్టలుడిగినట్టు నిల్చుండి పోయాడు.

15

అక్కడ రివాల్వర్ ధన్వంతరి గుండెకు గురిచూసి నిల్చున్నాడు మిష్టర్ ఎక్స్.

అతని కళ్ళు విషాన్ని కక్కుతున్నాయి. ఎర్రగా రక్తపు జీరలతో భయంకరంగా వున్నాయి.

"వెల్ కం మిష్టర్ కిరణ్! వెల్ కం!" అన్నాడతను రివాల్వర్ ని ఎగరేసి మళ్ళీ చేతుల్లో పట్టుకుని.

"కిరణ్ ఎవరు? అయామ్ ధన్వంతరి, డాక్టర్ ధన్వంతరి!" అన్నాడు ధన్వంతరి.

"ధన్వంతరి వేషంలో వచ్చిన డిటెక్టివ్ కిరణ్, డోంట్ మూవ్! జేబునుంచి చెయ్యి తీసెయ్యి లేకుంటే నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేస్తాను" అన్నాడు మిష్టర్ ఎక్స్.

ధన్వంతరిగా నటించిన డిటెక్టివ్ కిరణ్ రెండు చేతులు పైకెత్తి, మిష్టర్ ఎక్స్ వంక నవ్వుతూ చూసి, "వెల్, మిష్టర్ ఎక్స్! నన్ను బాగా తెలిసిన సన్నిహితులే నేను ధన్వంతరినని పొరబడ్డారు. కాని నువ్వు నన్ను కిరణ్ గా గుర్తించావు. హేట్సాఫ్ టుయూ!" అన్నాడు.

మిష్టర్ ఎక్స్ అట్టహాసంగా నవ్వాడు.

"నువ్వీ లాబ్ లోకి ప్రవేశించినప్పట్నుంచి నీ చర్యల్ని ప్రతిక్షణం, ప్రతి మూవ్ మెంట్ ని నా రూంనించి క్లోజ్ డ్ సర్క్యూట్ టి.వి.లో చూస్తూనే వున్నాను....

కమాన్ నువ్వు రిజిష్టర్‌నించి చించిపారేసిన ఆ కాగితాలు నాకు వెంటనే వాపసివ్వు" మిష్టర్ ఎక్స్ ఎడమచేతిని ముందుకు సాచాడు.

కిరణ్ జేబులో చెయ్యి పెట్టబోతుండగా "నో, నేనే తీసుకుంటాను. చేతులు పైకెత్తే నిల్చొని వుండు" అంటూ మిష్టర్ ఎక్స్ అతన్ని సమీపించి, ముందుగా కోటు జేబునుంచి రివాల్వర్ పైకితీసి తన జేబులో వేసుకున్నాడు. ఆ తర్వాత కిరణ్ దుస్తుల్లో దాచిన కాగితాలన్నీ ఒకటొకటిగా స్వాధీనం చేసుకున్నాడు.

కిరణ్ మౌనంగా మిష్టర్ ఎక్స్ వంకనే పరీక్షగా చూస్తూన్నాడు.

మిష్టర్ ఎక్స్ రివాల్వర్ మొన అతని గుండెలకు ఆనించి అతని దుస్తుల్లో ఫార్ములా కాగితాలన్నీ పూర్తిగా స్వాధీనం చేసుకుని, మరింక కాగితాలేవీ లేవని నిర్ధారణ చేసుకుని దూరంగా జరిగాడు.

"నా సామ్రాజ్యంలోకి అడుగుపెట్టిన శత్రువులెవరూ ఇంతదాకా ప్రాణాలతో బయటపడలేదు. నిన్నీపాటికే చంపేసి వుండేవాడిని. కాని, నీ గురించి, నీ మేధాశక్తి గురించి చాలా విన్నాను. ప్రత్యక్షంగా చూడగోరి ఇంత వరకు ఉపేక్షించాను.

"నీకు నా ప్రయోగశాలలో ఏం జరుగుతున్నదో అర్థమయిపోయిందని గ్రహించాను. ఇక తాత్సారం చెయ్యకూడదనే నీముందు ప్రత్యక్షమయ్యాను. ఇక నిన్ను ఉపేక్షించకూడదు" మిష్టర్ ఎక్స్ వేలు ట్రిగ్గర్ మీద బిగుసుకుంది.

"మిష్టర్ ఎక్స్, ఏం కోరి నువ్వీ భయంకరమైన ప్రయోగాలకి సిద్ధపడ్డావు? ఎందుకు ఇంత ఘోర

మారణకాండకు సిద్ధమయ్యావు? ఎందుకింత భయంకరమైన సూక్ష్మజీవిని నీ ప్రయోగశాలలో పెంచి పోషిస్తున్నావు? అణుబాంబుతో సమానంగా ప్రపంచాన్ని దారుణ మారణహోమం చేయు శక్తిగల ఈ సూక్ష్మజీవుల్ని ప్రపంచంమీద వదిలెయ్యాలనే ఘోరమైన ఆలోచన నీకెలా పుట్టింది?" ఆవేశంగా అడిగాడు కిరణ్.

మిస్టర్ ఎక్స్ అపహాస్యంగా నవ్వాడు.

"మిస్టర్ కిరణ్, నేను సూక్ష్మజీవుల్ని పెంచటంలేదు. ఓ గొప్ప ఏంటిబయాటిక్‌ని, మరో గొప్ప 'వాక్సిన్'ని నా ప్రయోగశాలలో సృష్టిస్తున్నాను. అయినా నీకిదంతా చెప్పినా అర్థంకాదులే...." అని ఇంకా యేదో అనబోతుండగా కిరణ్ అడ్డుతగిలాడు.

"నాకంతా తెలుసు మిస్టర్ ఎక్స్! నేను సైన్సు గురించి, ప్రయోగాల గురించి తెలియని మూర్ఖుడిననుకోకు! నీ నోటితోనే చెప్పించాలని అలా ట్రిక్ ప్లే చేశాను. చెప్పమంటావా నువ్వు చేస్తున్న పనేమిటో?

"విను: నువ్వో ఘోరమైన భయంకరమైన క్రిమిని మానవ శరీరంలోకి పంపిస్తున్నావు. ఆ క్రిమి శరీరంలోని ఉష్ణోగ్రతకి, అనుకూల పరిస్థితులకి వందలాది, వేలాది క్రిములుగా విడిపోయి భయంకరమైన విషజ్వరాన్ని కలిగిస్తుంది. క్షణాలమీద ప్రాణాలని బలిగొంటున్నది. శత్రువుల్ని మారణాయుధాలు ఉపయోగించవవసరం లేకుండా ప్రాణాలుతీసే బ్రహ్మాస్త్రం—ఈ క్రిమి.

"శరీరంలో ఈ క్రిమి వివిధ దశలని, దాని విశ్వరూపాన్ని—విషజ్వరం సోకిన మనిషినుంచి సేకరించిన రక్తంబొట్టుని స్లయిడ్ మీద కలెక్ట్ చేసి దాన్ని స్టెయినింగ్ చేసి లాబరేటరీలో మైక్రోస్కోపుల సాయంతో

పరీక్షిస్తున్నావు.

"మరోపక్క ఈ క్రిమి నెదుర్కోవటానికి ముందు జాగ్రత్త చర్యగా క్రిమిసోకిన మానవ శరీరంనుంచే ఇమ్యూనిటీ (వ్యాధి నిరోధక శక్తి)ని పెంపొందింపచేసే 'వాక్సిన్' కనిపెట్టి దానికి రసాయనిక ప్రయోగాలు చేస్తున్నావు.

"అంతేకాదు. ఈ వ్యాధినుంచి రక్షించటానికి ఈ క్రిములనుంచే 'ఏంటీబయాటిక్'ని తయారుచేస్తున్నావు పరీక్షనాళికల్లో 'ఫంగస్'లాంటి తెల్లటి పదార్థం ఆ ఏంటిబయాటిక్ ప్రథమస్థితి.

"ఎప్పటికప్పుడు ఇక్కడ నువ్వు సాధించిన ఫలితాల్ని, ప్రయోగ వివరాల్ని కోడ్ భాషలో యెప్పటికప్పుడు మెసేజ్ పంపుతున్నావు. అక్కడినుంచి వస్తున్న సూచనల్ని డీకోడ్ చేసుకుంటున్నావు.

"ఎప్పుడైతే డాక్టర్లు చికిత్స చేయటానికి రంగ ప్రవేశం చేశారో నీ ఆటలు సాగవని భయపడ్డావు. ఎప్పటికప్పుడు ఎలాగ్ అయిన కేసుల్ని 'వాళ్ళు' ట్రీట్ చేసేస్తుంటే నీ ప్రయోగాలకి తీవ్ర అంతరాయం యేర్పడింది.

"అందుకే వాళ్ళను వెనక్కి పంపెయ్యమని డాక్టర్ జయదేవ్ ని బెదిరిస్తూ లేఖలు రాశావు. అతను లక్ష్యపెట్టకపోగా నే వెంటనే అడ్డు తొలగించుకున్నావు.

"డిఎమ్ హెచ్ వో రంగంలోకి దిగకుండా వుండటానికి తప్పుడు టెలిగ్రాంలు పంపి, జయదేవ్ పంపిన టెలిగ్రాంలు బట్వాడా కాకుండా నే ముందుగా వాటిని ట్రాప్ చేయించావు. అయినా డిఎమ్ హెచ్ వో రానే వచ్చాడు. తక్కిన డాక్టర్లను బంధించిన చోటనే నీ

ప్రాకారంలో బంధించావు.

"చిలకల గూడెంలో నీ ప్రయోగం మొదలు పెట్టావు. అందరికీ ఇంజెక్ట్ చేయనక్కర్లేని శ్రమ అది! ఒకరికి సోకితే చాలు, అతన్నుంచి కొన్ని వేలమందికి క్షణాల్లో వ్యాప్తి చెందే ఎయిర్ బోర్న్ డిసీస్ (గాలి ద్వారా వ్యాపించే వ్యాధి) అది. అందుకే 'ఎపిడిమిక్' రూపంలో విజృంభించింది.

"అయితే ఒక్క ప్రశ్న అడుగుతాను. ఇదంతా యెందుకు చేస్తున్నావు?" ముగించాడు కిరణ్.

మిస్టర్ ఎక్స్ నిర్లక్ష్యంగా నవ్వి, "ఇన్ని తెల్సుకున్న వాడివి అవి కూడా తెల్సుకోలేక పోయావా?" అన్నాడు.

కిరణ్ మందహాసం చేసి, "ఆ మాత్రం గ్రహించలేని వాడిగా నన్ను భావించకు. ఈ దేశాన్ని వేర్పాటు వాదంతో ముక్క ముక్కలు చేసి మన దేశప్రజల ఐకమత్యాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని భగ్నం చేయాలని తలపన్నిన శత్రుదేశం నీకు కొన్ని కోట్ల విలువగల విదేశీ కరెన్సీనిస్తోంది.

"ఎప్పటికప్పుడు నీ ఫైండింగ్స్‌ని కనుక్కుని, అవసరమయిన సలహాలని కోడ్ భాషలో పంపుతోంది. నువ్వు, నీ లేడీ అసిస్టెంట్ దాన్ని డీకోడ్ చేస్తున్నారు. యామై రైట్?" అన్నాడు.

మిస్టర్ ఎక్స్ నిర్ఘాంతపోయాడు. తను ఊహించిన దానికన్నా చాలా తెలివైనవాడు ఈ డిటెక్టివ్. కాస్సేపటి క్రితం చోటి సే, డొంకంతా కదిపేశాడు. ఇక ఉపేక్షిస్తే లాభంలేదు.

"మిస్టర్ కిరణ్, ఇప్పటికే చాలా జాప్యం జరిగి

పోయింది. ఇక భగవంతుడ్ని తల్చుకో" రివాల్వర్ ఫర్మ్‌గా పట్టుకుని నవ్వాడు మిస్టర్ ఎక్స్.

ఆ నవ్వు తనని సవాల్ చేస్తున్నట్టు భావించాడు కిరణ్.

మిస్టర్ ఎక్స్ రివాల్వర్ సేఫ్టీ కాచ్ తప్పించాడు. మరుక్షణం బుల్లెట్ సూటిగా కిరణ్ గుండెల్లోంచి దూసుకుపోయి వుండేది!

అయితే మిస్టర్ ఎక్స్ ఊహించని విధంగా కిరణ్ షూ అడుగునున్న సోల్ నుంచి సర్‌మంటూ ఓ పదునైన చాకులాంటి ఆయుధం మిస్టర్ ఎక్స్ గుండెల్లో దూరి అతని గుండెనూ, ఊపిరితిత్తుల్నీ సర సర మంటూ కోసేసింది.

మిస్టర్ ఎక్స్ అమాంతం నేలకూలిపోయాడు.

"కిరణ్ కదిలేటంతలో "హేండ్సప్ మిస్టర్, డోంట్ మూవ్!" అంటూ సన్నటి కంఠం కంచులా మోగింది.

కిరణ్ ఉలిక్కిపడి ద్వారంవైపు చూశాడు. లేడీ అసిస్టెంటు!

ఆమె చేతిలో నల్లగా నిగనిగలాడుతున్న రివాల్వర్ కాలసర్పంలా కాటెయ్యటానికి సిద్ధంగా వుంది!

16

కిరణ్ మెరుపువేగంతో వంగి సాక్స్‌లో దాచిన రివాల్వర్‌ని అందుకుని అంతకంటే వేగంగా ఆమెకు గురి చూసి కాల్చాడు.

ఆమె ఈ పరిస్థితి ఎదుర్కోవటానికి సిద్ధంగా లేదు. ఒక్కసారిగా వెనక్కు విరుచుకుపడిపోయింది.

కిరణ్ ఆమెమీదినుంచి బయటకు గెంతి తక్కిన రెండు

రూములవైపు పరుగెత్తాడు.

అప్పటికింకా డైనింగ్ హాల్లో నుంచి సైంటిస్టులు బయటకి రాలేదు. మిస్టర్ ఎక్స్ యెంత ప్రమాదకరమయిన మనిషో అతను నియమించిన శాస్త్రజ్ఞులు కూడా అలాంటి ప్రమాదకారులే!

వాళ్ళని వదిలేస్తే దేశ వినాశనానికే వాళ్ళ ప్రతిభని, సామర్థ్యాన్ని వెచ్చిస్తారు.

అప్పటికప్పుడే ఓ నిర్ణయానికొచ్చాడు కిరణ్.

మిస్టర్ ఎక్స్ గదిలోకి పరుగెత్తాడు. ఇంతక్రితం ఆ గదిలో ఓ పక్కగా 'ఎక్స్‌ప్లోజివ్స్' అన్న పేరుతో వున్న కర్టన్ చూశాడు తను.

వెంటనే తన ఆలోచనని కార్యరూపంలో పెట్టాడు కిరణ్.

కర్టన్ తెరిచి అందులోనుంచి గ్రనేడ్స్ హేండ్ బాంబ్స్ బయటికి తీశాడు. వాటితోబాటు కనెక్టింగ్ రోప్ కూడా తీసుకున్నాడు.

లాబరేటరీస్ రెంటిలోను, వైర్లెస్ అపరేటస్ వున్న గదిలోను బాంబులు అమర్చాడు. వాటితోబాటు కనెక్టింగ్ రోప్ కలుపుకుంటూ వచ్చాడు.

ఆ తర్వాత డైనింగ్ హాల్లోని శాస్త్రజ్ఞులు బయటకి రాకుండా తలుపులు మూసెయ్యాలని ముందుకు పరుగెత్తాడు.

సరిగ్గా అప్పుడే యిద్దరు యువకులు బయటికి వస్తూ, కిరణ్‌ని చూసి గట్టిగా అరచి మిగతా వాళ్ళకు సిగ్నల్ ఇవ్వబోయారు.

అంతే! కిరణ్ రివాల్వర్ నుంచి వరుసగా రెండు గుళ్ళు బయల్దేడలి వాళ్ళ గుండెల్లో నిద్రపోయాయి.

దబ్బున నేలమీద పడిపోయారు వాళ్ళు.

డైనింగ్ హాల్ తలుపు బయట్నుంచి వేస్తూండగా వాళ్ళందరూ గోలగా పైకి లేచి ముందుకు రాబోయారు. కాని అప్పటికే కిరణ్ బయట్నుంచి తలుపులు మూసి గడియ పెట్టేశాడు.

ఆ హాలుకి అదొక్కటే ద్వారం కావటం చాలా మేలయ్యిందనుకున్నాడు కిరణ్.

ఆ మరుక్షణమే డాక్టర్లు బంధింపబడ్డ హాలు దగ్గరకు చేరుకున్నాడు కిరణ్. బయట తాళం పెట్టి వున్నది.

రివాల్వర్ గురిచూసి తాళం పేల్చేశాడు.

గడియతీసి డాక్టర్లవైపు చూసి, "కమ్ అవుట్ డాక్టర్స్! వెంటనే బిలంగుండా బయటకు పరుగెత్తండి" అన్నాడు పెద్దగా కిరణ్.

డిఎమ్‌హెచ్‌వోతో బాటు డాక్టర్లందరూ ఒక్క ఉదుటున బయటపడి వేగంగా బిలద్వారం వైపు దూసుకుపోయారు.

కిరణ్ చివరగా తనూ బయటికొచ్చి హేండ్‌బాంబ్ విసిరేశాడు సొరంగంలోకి. బాంబు ఢామ్మంటూ పేలింది.

రోప్ అంటుకుని సరసరమని కాలుకుంటూ గ్రెనేడ్స్‌ని తాకింది.

అంతే! బ్రహ్మాండమైన విస్ఫోటం!

కొద్ది క్షణాలవరకు ఆ ప్రాంతమంతా బాంబుల శబ్దాలతో అతి తీవ్రంగా కంపించిపోయింది.

—:అయిపోయింది:—